RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | బుధవారం 2-9-2026 | సంచిక: 13 | సంఖ్య: 335 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి |
|---|---|---|---|---|---|




# గ్లోబల్ ఎడ్యుకేషన్‌కు హైదరాబాద్ వేదిక..

## విదేశీ వర్సిటీలతో తెలంగాణ కీలక ఒప్పందాలు

- యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీకి హైదరాబాద్‌లో తొలి భారత క్యాంపస్‌లు
- హార్వర్డ్ సహా పలు ప్రపంచ స్థాయి సంస్థలతో తెలంగాణ ప్రభుత్వ చర్చలు
- విద్య, నైపుణ్యాభివృద్ధితో యువతకు నగరంలోనే అంతర్జాతీయ అవకాశాలు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అంతర్జాతీయ ఉన్నత విద్యకు హైదరాబాద్‌ను ప్రధాన వేదికగా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, అమెరికాలోని బోస్టన్‌కు చెందిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ నగరంలో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి. భారత్‌లో ఈ రెండు విశ్వవిద్యాలయాలు తొలిసారిగా క్యాంపస్‌లు ప్రారంభించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంతర్జాతీయ విద్యాసంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో

2లో



## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట




## నేపాల్ విపత్తుపై ముందే కీలక డేటా అందించిన 'నైసర్' శాటిలైట్

- విమర్శల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు
- కొండచరియల్లో మార్పులను వారాల ముందే గుర్తించిన రాడార్
- చైనా పరిశోధకుడి విశ్లేషణలో కీలక విషయాల వెల్లడి
- ఇస్రో-నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన ఉపగ్రహం



## తెలంగాణ కాంగ్రెస్ పరిణామాలపై హైకమాండ్ ఫోకస్..


- ఢిల్లీలో వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ
- రాష్ట్ర రాజకీయాల తాజా పరిణామాలపై ఇద్దరు నేతల మధ్య చర్చ
- కొండా సురేఖ--చిన్నారెడ్డి వ్యవహారంపైనా అధిష్ఠానం ఆరా తీసినట్లు సమాచారం
- ప్రభుత్వం--పార్టీ మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ



## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్..

- పేద కుటుంబాలకు ఊరట
- రెండు పథకాలపై సింగిల్ బెంచ్ విధించిన నిలుపుదలను తొలగించిన సీజే ధర్మాసనం
- ప్రభుత్వ అప్పీల్‌పై విచారణ అనంతరం కీలక ఆదేశాలు
- పథకాలతో నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందని ప్రభుత్వ

2లో



## ఉక్రెయిన్‌లో విషాద ఘటన

### రష్యా దాడుల్లో భారతీయ పౌరుడి మృతి

- ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడుల్లో భారత పౌరుడు మృతి
- ప్రకటించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- గత ఐదు రోజుల్లో 12 మంది మరణించారని, వారిలో భారతీయుడు ఉన్నారని వెల్లడి



## రాంచందర్ రావు అరెస్ట్ కాంగ్రెస్ అరాచకానికి నిదర్శనం

- పరామర్శకు వెళుతున్న రాంచందర్ రావును అరెస్ట్ చేయడం హేయమన్న నితిన్ నబీన్
- రాజ్యాంగం గురించి రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ నాటకాలేనని విమర్శ
- కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్య

2లో



## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..

- వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత: మంత్రి నారా లోకేశ్
- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం

# ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

2లో

- రేపు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి
- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు
- రేపు పాయకరావుపేటలో జలాలకు హారతి ఇచ్చి విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యం
- నాలుగు నదులు, తూర్పు కనుమలు దాటుతూ సాగిన కాలువ నిర్మాణం
- భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేసి 8 లక్షల ఎకరాలకు నీరు



త్తరాంధ్ర ప్రజల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేస్తూ గోదారమ్మ ఆ ప్రాంతంలోకి అడుగుపెడుతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా వరకు పరుగులు పెడుతున్నాయి. నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది.

# ఎంపీ లాడ్స్‌పై నివేదికతో బండి సంజయ్ అసంతృప్తి..

- కరీంనగర్ నిధులపై లెక్కలు విడుదల
- తన నియోజకవర్గానికి మంజూరైన రూ.17.50 కోట్లలో వివిధ దశల్లో రూ.16.47 కోట్ల పనులు
- 627 అభివృద్ధి ప్రతిపాదనల్లో 82.29% పనులకు అనుమతులు వచ్చినట్లు వెల్లడి
- క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా నివేదికలు ఇవ్వొద్దని సంస్థకు సూచన



## పులివెందులలో జగన్‌కు ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు



- రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందుల చేరుకున్న జగన్
- తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన వైసీపీ అధినేత
- రేపు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

వైసీపీ అధినేత జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందులకు చేరుకున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆయన

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## ఉక్రెయిన్‌లో విషాద ఘటన

ఉక్రెయిన్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. రష్యా చేపట్టిన భీకర దాడుల్లో ఒక భారతీయ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ధ్రువీకరించారు. గత ఐదు రోజులుగా రష్యా సాగిస్తున్న దాడుల్లో మొత్తం 12 మంది మరణించారని, వారిలో ఒకరు భారతీయుడని ఆయన వెల్లడించారు. గత ఐదు రోజులుగా రష్యా డ్రోన్లు, క్షిపణులతో దాడులను తీవ్రతరం చేసిందని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా తెలిపారు. కీవ్, ఖేర్సన్, డొనెట్స్క్, జపోరిజియా సహా పలు కీలక ప్రాంతాలపై ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆరోపించారు. తమకు గగనతల రక్షణ వ్యవస్థలు తగినన్ని లేవని, ఈ విషయంలో అంతర్జాతీయ సమాజం సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, మరణించిన భారతీయ పౌరుడి వివరాలను గానీ, అతను ఎక్కడ మరణించాడనే అంశాన్ని గానీ అధ్యక్షుడు వెల్లడించలేదు. ఈ ఘటనపై కీవ్‌లోని భారత రాయబార కార్యాలయం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ దిశగా మృతుడి కుటుంబం, అతను పనిచేస్తున్న సంస్థ, అలాగే ఉక్రెయిన్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.

## తెలంగాణ కాంగ్రెస్ పరిణామాలపై
# హైకమాండ్ ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ, సెప్టెంబర్: తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పార్టీ అగ్రనేత కేసీ వేణుగోపాల్‌తో సమావేశం కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వేణుగోపాల్ నివాసానికి వెళ్లిన సీఎం.. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులతో పాటు కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత అంశాలపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసిన నేపథ్యంలో దానికి సంబంధించిన పరిణామాలపై కూడా ఇరువురు నేతలు మాట్లాడినట్లు సమాచారం. ఈ వ్యవహారం పార్టీపై చూపుతున్న ప్రభావం, నాయకుల మధ్య సమన్వయం ఎలా కొనసాగించాలనే అంశాలపై అధిష్ఠానం నుంచి వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం పరస్పర సమన్వయంతో ముందుకు సాగాల్సిన తీరుపైనా చర్చ జరిగినట్లు సమాచారం. అదే సమయంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడం వంటి అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధిష్ఠానానికి చెందిన ముఖ్య నేతలను వరుసగా కలుస్తున్న నేపథ్యంలో కేసీ వేణుగోపాల్‌తో జరిగిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై అధిష్ఠానంతో ముఖ్యమంత్రి చర్చలు జరు

# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# గ్లోబల్ ఎడ్యుకేషన్‌కు హైదరాబాద్ వేదిక..

భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించింది. అమెరికా పర్యటనకు ముఖ్యమంత్రికి కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో అధికారుల బృందం అక్కడ పర్యటించి వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఈ చర్చల ఫలితంగానే రెండు ప్రముఖ వర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ముందుకొచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, వివిధ కోర్సులు నిర్వహించే అంశంపై ఆసక్తి చూపినట్లు ప్రభుత్వం తెలిపింది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రముఖ విద్యాసంస్థలతోనూ తెలంగాణ ప్రతినిధులు చర్చలు జరిపినట్లు పేర్కొంది. విదేశీ వర్సిటీలు హైదరాబాద్‌లో అడుగుపెట్టడం రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి గణనీయమైన ప్రోత్సాహమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్సులు, శిక్షణ హైదరాబాద్‌లోనే అందేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలకు లభిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుంటూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

## రాంచందర్ రావు అరెస్ట్ కాంగ్రెస్ అరాచకానికి నిదర్శనం

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పులివెందులలో జగన్‌కు ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

పులివెందుల చేరుకోగా... హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులు, స్థానిక శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా జగన్ భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి ఆయన పులివెందులలోని తన స్వగృహంలోనే బస చేయనున్నారు. రేపు ఉదయం 7.45 గంటలకు జగన్ ఇడుపులపాయకు బయల్దేరి వెళతారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన తాడేపల్లికి తిరుగు ప్రయాణం కానున్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్..

హైదరాబాద్: తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో అనుకూల తీర్పు లభించింది. ఈ రెండు సంక్షేమ కార్యక్రమాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం రద్దు చేసింది. ఈ పథకాలపై సింగిల్ బెంచ్ విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. మంగళవారం దీనిపై విచారణ జరగ్గా.. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వివాహ సమయంలో ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. న్యాయస్థానం విధించిన నిలుపుదల కారణంగా ఆయా పథకాలపై ఆధారపడుతున్న పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ పథకాల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ సింగిల్ బెంచ్‌లో దాఖలైన పిటిషన్ విచారణకు స్వీకరించదగినది కాదని ప్రభుత్వం తరఫున వాదించారు. పథకాల అమలుకు ఎలాంటి ఆటంకం లేకుండా గతంలో విధించిన స్టేను తొలగించాలని ధర్మాసనాన్ని కోరారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది చేసిన వాదనలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం.. సింగిల్ బెంచ్ ఇచ్చిన నిలుపుదల ఉత్తర్వులను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు కొనసాగింపు మార్గం సుగమమైంది.

# ఎంపీ లాడ్స్‌పై నివేదికతో బండి సంజయ్ అసంతృప్తి..

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్: ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ ఇచ్చిన నివేదికను కేంద్ర మంత్రి బండి సంజయ్ తప్పుబట్టారు. ఎంపీలు నిధులు ఖర్చు చేయడంలో వెనుకబడ్డారంటూ వచ్చిన నివేదిక వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నిధుల మంజూరు, పనుల పురోగతి, ఆమోదాల వివరాలను గణాంకాలతో వెల్లడించారు. తన నియోజకవర్గానికి కేంద్రం నుంచి రూ.17.50 కోట్లు మంజూరయ్యాయని బండి సంజయ్ తెలిపారు. ఇందులో రూ.16.47 కోట్ల మేర పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అంటే కేటాయింపుల్లో 94.1 శాతం నిధులకు సంబంధించిన పనులు ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. గత మూడేళ్ల కాలంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనుల కోసం 627 ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్లకు పంపినట్లు చెప్పారు. వీటిలో 82.29 శాతం ప్రతిపాదనలకు ఇప్పటికే అనుమతులు లభించాయని పేర్కొన్నారు. ఇంతకుముందు 16వ లోక్‌సభలో కరీంనగర్‌కు ప్రాతినిధ్యం వహించిన బి. వినోద్‌కుమార్ వినియోగించకుండా మిగిల్చిన రూ.2.50 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులను కూడా తాను అభివృద్ధి పనులకు వినియోగించినట్లు సంజయ్ తెలిపారు. ఎంపీ లాడ్స్ కింద స్థానిక అవసరాలకు కేటాయిస్తున్న మొత్తం సరిపోవడం లేదని, నిధుల పరిమితిని పెంచాలని దేశవ్యాప్తంగా ఎంపీలు కోరుతున్నారని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపీల పనితీరుపై పూర్తి వివరాలు పరిశీలించకుండా ఏకపక్షంగా నివేదికలు ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. నిధులు మంజూరు కావడం నుంచి కలెక్టర్ స్థాయిలో అనుమతులు పొందడం, పనులు ప్రారంభమై పూర్తయ్యే వరకు పలు దశలు ఉంటాయని బండి సంజయ్ వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేందుకు ఇంకా గడువు ఉన్నందున, నిధులకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ఎంపీ లాడ్స్‌తో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను కూడా సమీకరిస్తున్నామని చెప్పారు. ఇకపై నివేదికలు రూపొందించే ముందు క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితిని పరిశీలించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థకు సూచించారు.

# నేపాల్ విపత్తుపై ముందే కీలక డేటా అందించిన 'నైసర్' శాటిలైట్

నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఘోర విపత్తు నేపథ్యంలో, ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నైసర్' ఉపగ్రహం పనితీరుపై వచ్చిన విమర్శలు నిరాధారమని తేలింది. విపత్తును ముందుగా హెచ్చరించడంలో ఈ శక్తిమంతమైన శాటిలైట్ విఫలమైందన్న ఆరోపణలను తాజా విశ్లేషణలు పటాపంచలు చేశాయి. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే నైసర్ స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను పంపిందని వెల్లడైంది. చైనాలోని చాంగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి జెన్‌షియాంగ్ లియు, నైసర్ చిత్రాలను విశ్లేషించి ఈ కీలక విషయాలను వెల్లడించాడు. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే ప్రమాదకర ప్రాంతంలోని పర్వత వాలులో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు అతడు గుర్తించాడు. అక్కడి మంచు, రాతి పొరలు తీవ్ర ఒత్తిడికి గురై, ఆ ప్రాంతం ఏకంగా కొన్ని మీటర్ల మేర పక్కకు జరిగినట్లు తేలింది. ఈ కదలికలు ఒకేచోట కేంద్రీకృతం కావడం, రాబోయే కొండచరియల విపత్తుకు స్పష్టమైన సంకేతమని లియు తన విశ్లేషణలో పేర్కొన్నాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా ఈ 'నైసర్' (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించి, హెచ్చరికలు జారీ చేసే లక్ష్యంతో దీన్ని గత ఏడాదే ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భూ పరిశీలన ఉపగ్రహాల్లో ఒకటి. మేఘాలు, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా స్పష్టమైన చిత్రాలను తీయగల రెండు సింథటిక్ అపెర్చర్ రాడార్లను (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) కలిగి ఉన్న తొలి శాటిలైట్ ఇదే. ఈ వివరాల ప్రకారం, నైసర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని, విపత్తుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందే అందించిందని స్పష్టమవుతోంది. అయితే, ఆ సంకేతాలను సరైన సమయంలో విశ్లేషించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడంలోనే అసలు సవాలు ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.

# ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు.

ఉఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లు అందించి, కూటమి ప్రభుత్వం తన సంకల్పాన్ని నిలబెట్టుకుంది. మంగళవారం మధ్యాహ్నం 2:20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంతో ఉత్తరాంధ్ర సాగునీటి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.

### కొండలు, నదులు దాటిన ఇంజనీరింగ్ అద్భుతం

గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడం అనేది ఒక గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. ఈ ప్రయాణంలో పంపా, తాండవ, వరాహ, శారద వంటి నాలుగు నదులను, ఏలేరు కాలువను, తూర్పు కనుమలను దాటాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు వెచ్చించి అధునాతన సాంకేతికతతో నిర్మాణాలు చేపట్టింది. కొన్నిచోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు, మరికొన్ని చోట్ల ప్రవాహానికి దిగువన సైఫన్లు నిర్మించారు. ముఖ్యంగా ఏలేరు నది గర్భం కింద నుంచి గోదావరి నీటిని తరలించేందుకు సైఫన్‌ను, పంపా నదిపై 30 మీటర్ల లోతు పునాదులతో భారీ అక్విడెక్టును నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 447 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాజెక్టు సంక్లిష్టతకు నిదర్శనం.

### లక్షల ఎకరాలకు భరోసా.. భవిష్యత్తుకు మార్గం

ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. దీంతోపాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పుష్కర ఆయకట్టు కింద 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా, తాండవ, వరాహ తదితర ఆయకట్టుల కింద మరో 58,000 ఎకరాలకు పైగా భూమి స్థిరీకరణ జరగనుంది. వచ్చే ఏడాది నాటికి ఈ జలాలను విశాఖపట్నం వరకు పొడిగించి, ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఎడమ కాలువ ద్వారా మొత్తం 23.44 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెస్తారు. ఈ బృహత్తర ప్రణాళిక పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలతో సహా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అంది, ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోనుంది.



# మైనారిటీ మహిళలకు రూ.50 వేల సాయం..

- కూకట్‌పల్లిలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజనతో స్వయం ఉపాధికి ప్రోత్సాహం
- కూకట్‌పల్లి అర్హులైన మహిళలకు చెక్కులు అందజేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- పథకం అమలులో బండి రమేష్ ప్రత్యేక చొరవ

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు స్వయం ఆధారితంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన ద్వారా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన అర్హులైన మహిళలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ మొత్తాన్ని ఉపయోగించుకుని మహిళలు చిన్న వ్యాపారాలు ప్రారంభించడంతో పాటు వివిధ స్వయం ఉపాధి కార్యకలాపాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. తద్వారా కుటుంబాలకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడి, మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

**బండి రమేష్ చొరవ**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అర్హులైన మైనారిటీ మహిళలకు పథకం ప్రయోజనం అందేలా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ చొరవ చూపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పథకానికి అర్హత ఉన్న మహిళలను గుర్తించడం, వారికి ప్రభుత్వ పథకంపై సమాచారం అందించడం, అధికారులతో సమన్వయం చేయడం వంటి అంశాల్లో ఆయన సహకరించినట్లు పేర్కొన్నారు. మైనారిటీ మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం అందించడం ద్వారా వారి కుటుంబ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడమే ప్రభుత్వ ఉద్దేశమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రూ.50 వేల సహాయం అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక తోడ్పాటు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు, పథకం ద్వారా ప్రయోజనం పొందేలా సహకరించిన బండి రమేష్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, వాజిద్ భాష, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి..

హెచ్--82 పటాన్‌చెరు డివిజన్‌కు కొత్త కమిటీ

బుక్క శ్రీకాంత్‌కు అధ్యక్ష బాధ్యతలు.. బైండ్ల భానుకు కార్యదర్శి పదవి

కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ హామీ

వివిధ హోదాల్లో పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్మికులు



**గుమ్మడిదల (పటాన్‌చెరు), సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** విద్యుత్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల హెచ్--82 సంఘం పటాన్‌చెరు విభాగానికి కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసింది. పటాన్‌చెరు డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బుక్క శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బైండ్ల భానును ఎన్నుకున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు బుక్క శ్రీకాంత్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం దిశగా ముందుకు సాగుతానన్నారు. సిబ్బంది హక్కులు, సంక్షేమ అంశాలపై సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా యు. శివకుమార్, మోహన్, ఏ. వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె. శ్రీశైలం, అరుణ్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కోశాధికారిగా అనిల్‌బాబు, వ్యవస్థాపక కార్యదర్శులుగా వీరేష్, రమేష్ నాయక్, రామకృష్ణలను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్, రోడ్డా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సంఘం సామాజిక మాధ్యమాల నిర్వహణ బాధ్యతలను సుధాకర్, రవీందర్ నాయక్‌కు అప్పగించారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, పోచయ్య, సాగర్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రఘు, శివ, కృష్ణ, శ్రీశైలం, మోహన్, వీరేష్, అనిల్‌బాబుతో పాటు పలువురు విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ సమరశంఖం..

సెప్టెంబర్ 2 నుంచి డివిజన్ల వారీగా ప్రజా సమావేశాలు: బీఆర్ఎస్

కాంగ్రెస్ హామీలు, గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ ఉద్యమం

ఇంటింటికీ 'బాకీ కార్డులు' చేరేలా ప్రచారం చేపట్టాలని రెడ్డి సతీష్ అరోరా పిలుపు

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో విస్తృత కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో చర్చకు తీసుకెళ్లడంతో పాటు, డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ప్రజా సమావేశాలు నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయా కార్యక్రమాలను మాజీ కార్పొరేటర్ల నేతృత్వంలో నిర్వహించనున్నట్లు అరోరా తెలిపారు.



**సమావేశాల షెడ్యూల్ ఇలా....**

- సెప్టెంబర్ 2న బోయినపల్లి డివిజన్‌లో సమావేశం
- సెప్టెంబర్ 4న బాలానగర్ డివిజన్‌లో కార్యక్రమం
- సెప్టెంబర్ 5న బేగంపేట డివిజన్‌లో సమావేశం
- సెప్టెంబర్ 6న ఫతేనగర్ డివిజన్‌లో ప్రజా భేటీ
- సెప్టెంబర్ 7న మూసాపేట్ డివిజన్‌లో కార్యక్రమం
- సెప్టెంబర్ 8న అల్లాపూర్ డివిజన్‌లో సమావేశం
- సెప్టెంబర్ 9న బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్లను కలిపి సమావేశం
- సెప్టెంబర్ 10న కూకట్‌పల్లి డివిజన్‌లో కార్యక్రమం

కాంగ్రెస్ ప్రకటించిన హామీలు, గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించేందుకు క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టనున్నట్లు అరోరా పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే కాంగ్రెస్ హామీలపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేస్తూ ఇంటింటికీ 'బాకీ కార్డులు' చేరేలా కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి.. రాజిరెడ్డి ఫైర్..

"ప్రజల్లో తేల్చుకోవాలి.. దాడులతో కాదు" అంటూ హితవు


నాంపల్లి ఘటన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: నర్సంపల్లి రాజిరెడ్డి

రాజకీయ విభేదాలకు హింస పరిష్కారం కాదని వ్యాఖ్య

కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదని స్పష్టం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు దాడులు, విధ్వంసాలకు పాల్పడటం సరికాదని బీజేపీ గుమ్మడిదల మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి అన్నారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన ఘటనను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయ భేదాలను ప్రజల మధ్య ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు కట్టుబడి సంయమనంతో వ్యవహరిస్తున్నారని రాజిరెడ్డి పేర్కొన్నారు. తమ నిశ్శబ్దాన్ని బలహీనతగా పరిగణించవద్దని హెచ్చరించారు. రాజకీయంగా అభ్యంతరాలు ఉంటే సభలు, సమావేశాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించాలే తప్ప పార్టీ కార్యాలయాలపై దాడులకు దిగడం తగదన్నారు. బీజేపీ శ్రేణులు పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తాయని చెప్పారు. వీర శివాజీ స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేస్తున్నారని, ఎలాంటి ఒత్తిళ్లకు వెనుకాడకుండా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తారని అన్నారు. బీజేపీని రాజకీయంగా ఎదుర్కోవాలనుకునే వారు ప్రజాక్షేత్రంలోకి రావాలని రాజిరెడ్డి సూచించారు. దాడులు, ధ్వంసకాండకు పాల్పడటం పిరికితనాన్ని ప్రతిబింబిస్తుందని విమర్శించారు. ఇటువంటి చర్యల ద్వారా బీజేపీ కార్యకర్తలను వెనక్కి తగ్గించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే అవి హింసాత్మక ఘటనలకు కారణం కాకూడదని అన్నారు. నాంపల్లి ఘటనపై అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశం లో రవీందర్ రెడ్డి, రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి

హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం

తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా

అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి

యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ

హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

# రాహుల్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు.. నాగర్‌కర్నూల్‌లో మంత్రి జూపల్లి నిరసన

కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన జూపల్లి

అంబేద్కర్ చౌరస్తాలో గంటపాటు రహదారిపై బైఠాయింపు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైన వ్యవహారాన్ని నిరసిస్తూ తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు నాగర్‌కర్నూల్‌లో ఆందోళనకు దిగారు. ఈ కేసు వెనుక కేంద్ర ప్రభుత్వ కక్షపూరిత వైఖరి ఉందని ఆరోపించిన ఆయన.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం మంత్రి



జూపల్లి కృష్ణారావు రహదారిపై సుమారు గంటపాటు బైఠాయించారు. రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. అలాంటి నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించడం కేంద్ర ప్రభుత్వ దురుద్దేశపూరిత చర్యగా అభివర్ణించారు. సోనియాగాంధీ కుటుంబానికి గతంలో ఉన్నత పదవులు, అవకాశాలు లభించినప్పటికీ వాటిని స్వీకరించలేదని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ర్యాలీ వేదికపైకి వెళ్లిన ఘటనను ప్రస్తావించిన మంత్రి.. ఆ ఘటనకు సంబంధించి శుద్ధి కార్యక్రమం నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోకుండా, దానిని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తోందని జూపల్లి ఆరోపించారు. దేశ ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గళమెత్తాలని కోరారు. "మోదీ హటావో.. దేశ్‌కి బచావో" అంటూ నినదిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# అమిత్ షా దిష్టిబొమ్మ దహనం..

**రాహుల్‌పై ఎఫ్ఐఆర్‌కు నిరసనగా కరీంనగర్‌లో కాంగ్రెస్ ఆందోళన**

**రాజీవ్ చౌక్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన**

**రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

**ప్రతిపక్ష నేతల గొంతు నొక్కే చర్యలను సహించబోమని హెచ్చరిక**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపిస్తూ కరీంనగర్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. టీపీసీసీ సూచనల మేరకు రాజీవ్ చౌక్ వద్ద జరిగిన ఆందోళనలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై బీజేపీ--ఆర్ఎస్ఎస్ వర్గాలు కులపరమైన చర్యలకు పాల్పడ్డాయని ఆరోపించారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందించడాన్ని కారణంగా చూపి ఆయనపై కేసు నమోదు చేయడం సమర్థనీయం కాదని అన్నారు. హల్ద్వానీ ఘటనకు అసలు బాధ్యులుగా భావిస్తున్న బీజేపీ కార్యకర్తలపై ముందుగా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారు ప్రతిపక్ష నాయకులపై కేసులతో ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని విమర్శించారు. రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ ప్రతిపక్ష నేతలకు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని కేంద్ర, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ శ్రేణులను భయపెట్టే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్‌తో పాటు గుర్రం వాసు, తాళ్లపల్లి శ్రీకాంత్, అజయ్ గౌడ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దోమడుగు విద్యార్థులకు హెటెరో ల్యాబ్స్ అండ.. 220 మందికి రూ.5 వేల విలువైన విద్యా సామగ్రి

**ప్రతి విద్యార్థికి బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం, షూలు అందజేత**

**ప్రభుత్వ పాఠశాలల పిల్లల చదువుకు సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమం**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం అందించేందుకు హెటెరో ల్యాబ్స్ యూనిట్--1 ముందడుగు వేసింది. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలోని పాఠశాలల విద్యార్థులకు సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విద్యా సామగ్రిని ఉచితంగా అందించింది. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.5 వేల విలువైన వస్తువులను పంపిణీ చేశారు. దోమడుగు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న 120 మంది, ప్రాథమిక పాఠశాలలోని 100 మంది కలిపి మొత్తం 220 మంది విద్యార్థులు ఈ సహాయాన్ని అందుకున్నారు. పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు, క్రీడా దుస్తులు, షూలతో పాటు అవసరమైన ఇతర సామగ్రిని వారికి అందించారు. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో హెటెరో ల్యాబ్స్ యూనిట్--1 మానవ వనరుల విభాగం ప్రతినిధి ఉమ్మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిలర్లు అభిశెట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్‌రెడ్డి, నర్సంపల్లి రాజిరెడ్డి, బి. వరలక్ష్మి కృష్ణతో పాటు గ్రామస్థులు పెంటారెడ్డి, అనూరాధ, జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. విద్యార్థుల చదువుకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా హెటెరో ల్యాబ్స్ యూనిట్--1 సామాజిక బాధ్యతను చాటుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు. సంస్థ అందిస్తున్న సహకారం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులోనూ



# అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్

**అభినందనలు తెలిపిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్: సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జగన్‌కు అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్..

**మూడు దిగ్గజ సంస్థలతో కొత్త భాగస్వామ్యం**

**మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కలిసి పరిశోధనలకు శ్రీకారం**

**ఖనిజాల గుర్తింపు నుంచి శుద్ధి వరకు ఆధునిక సాంకేతికతపై దృష్టి**

**వ్యర్థ పదార్థాల నుంచే కీలక ఖనిజాల వెలికితీతకు ప్రాధాన్యం**



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం): క్రిటికల్ మినరల్స్ రంగంలో తెలంగాణను పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలు కలిసి పని చేయనున్నాయి. ఈ మూడు సంస్థల మధ్య త్రిముఖ భాగస్వామ్యంతో కీలక ఖనిజాలపై పరిశోధనలు చేపట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖనిజ నిక్షేపాలను గుర్తించడం, వాటిని వెలికితీయడం, శుద్ధి చేయడం వంటి అంశాల్లో ఆధునిక విధానాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు భట్టి తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామిక వ్యర్థాల్లో అందుబాటులో ఉన్న క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ తయారీ, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలకు అవసరమైన ముడి పదార్థాల లభ్యత భవిష్యత్‌లో కీలకంగా మారనుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రతిపాదిత పరిశోధనలు ఆశించిన ఫలితాలను ఇస్తే ఈ రంగాల్లో ఎదురయ్యే ముడి పదార్థాల కొరతను కొంతవరకు అధిగమించే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, కొత్త ఆవిష్కరణలకు ప్రముఖ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ దిశగా ఐఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. పరిశోధనలకే పరిమితం కాకుండా.. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని వాణిజ్య స్థాయిలో ఉపయోగించుకునేలా విస్తరించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దీని ద్వారా తెలంగాణలో క్రిటికల్ మినరల్స్ రంగానికి పరిశోధనతో పాటు పారిశ్రామిక అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవంపై ధర్మారావు సంచలన వ్యాఖ్యలు..

- విమోచన దినోత్సవాన్ని విస్మరిస్తున్నాయంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై మండిపాటు
- సెప్టెంబర్ 2న కాజీపేట నుంచి పరకాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ర్యాలీ
- పరకాల అమరధామం తెలంగాణ పోరాట చరిత్రకు ప్రతీక: ధర్మారావు



**పరకాల, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణ విమోచన చరిత్రను పక్కన పెడుతున్నాయని ఆయన ఆరోపించారు. పరకాలలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. తెలంగాణ విమోచన పోరాటంలో పరకాల ప్రాంత ప్రజల పాత్రను ఆయన ప్రస్తావించారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలనే ఉద్యమ సమయంలో ఈ ప్రాంతానికి చెందిన పలువురు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ చరిత్రను ప్రజలకు మరోసారి గుర్తు చేసే ఉద్దేశంతో సెప్టెంబర్ 2న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కాజీపేట నుంచి ర్యాలీగా పరకాలకు రానున్నారని ధర్మారావు తెలిపారు. పరకాలలో అమరులైన వారిని స్మరించుకుని నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 1947 సెప్టెంబర్ 2న పరకాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చిన సమయంలో రజాకార్లు కాల్పులు, లాఠీచార్జికి పాల్పడ్డారని ధర్మారావు పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అనంతరం 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం రజాకార్ల పాలన నుంచి విముక్తి పొందిందన్నారు. పరకాల పట్టణంలోని అమరధామం నాటి పోరాటానికి గుర్తుగా నిలిచిందని ధర్మారావు చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన శిల్పాలు రజాకార్ల దురాగతాలను, నాటి ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తున్నాయని అన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంపై బీజేపీ వైఖరిని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ కూడా వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతామని తెలిపారు. డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో ఆర్‌పీ జయంత్‌లాల్, దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో కొట్టుకు పోయిన బ్యాంక్ లాకర్లు

**వాటిని కాపలా కాస్తూ..పోయిన వాటి కోసం వెదుకులాట**

ఖాట్మండ్: నేపాల్ వరదలు సృష్టించిన బీభత్సం పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. అకస్మాత్తుగా వచ్చిన వరదలను ఎదుర్కొనడానికి నేపాల్ ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. అయితే ప్రస్తుతం ఓ సమస్య నేపాల్ ప్రభుత్వానికి, పోలీసులకు కంటి మీద కునుకు రాకుండా చేస్తోంది. భారీస్థాయిలో వచ్చిన వరదల వల్ల సుమారు 20 బ్యాంకులకు చెందిన లాకర్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆ లాకర్లు దుండగుల చేతుల్లోకి చిక్కకుండా వాటిని సురక్షితంగా స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీఐజీ అబి నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆకస్మిక వరదల నేపథ్యంలో గల్లంతైన వ్యక్తుల కోసం గాలించడం, వారిని రక్షించి సురక్షిత ప్రాంతాల్లోకి తరలించడానికే పోలీసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కూడా తమపైనే ఉందని డీఐజీ పేర్కొన్నారు. రసువా, ధాదింగ్, చిత్వన్ తదితర ప్రాంతాల్లోని పలు బ్యాంకులు వరదల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయని నారాయణ్ తెలిపారు. వరదల్లో కొట్టుకుపోయిన లాకర్లలో బంగారం, విలువైన వస్తువుల గల లాకర్లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మరికొన్ని లాకర్లు బురద కింద కూరుకుపోయాయని, పోలీసులు వాటిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# ప్రభుత్వం పంచాయతీలకు సీసీ కెమెరాలను అందజేయాలి

### బీఆర్ఎస్ కార్యకర్త మాజీ సర్పంచ్ రాథోడ్ సోనీ శివరాం..



**అల్లాదుర్గం:** అల్లాదుర్గ మండల కేంద్రంలోని గొల్ల గుండా తండా గ్రామంలోని ప్రజల భద్రత, శాంతి భద్రతలు, ఆస్తుల రక్షణ కోసం, దొంగతనాలను, నేరాలను అరికట్టడం కోసం ప్రతి గ్రామపంచాయతీకి ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ కార్యకర్త రాథోడ్ శివరాం మరియు మాజీ సర్పంచ్ రాథోడ్ సోనీ శివరాం డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో కెమెరాల ఏర్పాటుతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఆధారాలు స్వీకరించేందుకు మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో గ్రామ భద్రతను పర్యవేక్షించుకునే అవకాశం ఉందన్నారు. అనుమానస్పద కార్యకలాపాలను త్వరగా గుర్తించవచ్చని గ్రామంలో భద్రతపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడవచ్చున్నారు.

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**తుర్కపల్లి, సెప్టెంబర్:** తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోరెడ్డి మహిపాల్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోరెడ్డి మహిపాల్ రెడ్డి దంపతులను పట్టు వస్త్రాలు సమర్పించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా నాయకులు ఎలగల రాజయ్య, దేవరుప్పల ఐలయ్య, భాస్కర్ నాయక్ ,ఎరుకల వెంకటేష్ గౌడ్, సర్పంచులు సోమల వెంకటేశం, భూక్య రాజారాం నాయక్, బాబు నాయక్, మాజీ ఎంపీపీ లు బోరెడ్డి రాంరెడ్డి, బబ్బురి రవీంద్రనాథ్ గౌడ్, మాజీ సర్పంచ్ సింగం వెంకటేశం, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పెండెం రవి, నాయకులు బోరెడ్డి రాంరెడ్డి, రామగోని వెంకటేష్ గౌడ్, బోరెడ్డి లక్ష్మి నర్సింహారెడ్డి, బానోతు వీరన్న నాయక్ ,శివరాత్రి జహంగీర్, దొమ్మాట బాబు, ఉప సర్పంచులు పల్లె నరేష్ గౌడ్, నాగాయపల్లి శివరాములు,, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జహంగీర్ ,సీనియర్ గ్రామీణ వైద్యుడు ఆకుల దేవయ్య, నాయకులు చాడ కరుణాకర్ రెడ్డి, ఏసబోయిన రాజయ్య ,నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గట్టుప్పల్.మండల గౌడ సంఘం అధ్యక్షుని గా బొల్లెపల్లి వెంకటేశం గౌడ్



**గట్టుపల్ సప్టెంబర్1:** గట్టుపల్ మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా బొల్లేపల్లి వెంకటేష్ గౌడ్ నియమితులయ్యారు ఈ సందర్భంగా బొల్లెపల్లి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ అనునిత్యం గౌడ సమస్యలపై పరిష్కారం కొరకు పాటుపడతానని గౌడ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు తన నియామకానికి సహకరించిన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నగరికంటి కాశయ్య గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా గట్టుప్పల్.మండల ప్రజలు నూతనంగా ఎన్నికైన బొల్లెపల్లి వెంకటేష్ గౌడ్ పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# జనగణనలో బీసీలను లెక్కించకుండా మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వం...

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మాడుగుల పల్లి** :బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వశీ యొక్క నిర్లక్ష వైఖరి సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారశీలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చి తీరా కులగణన జరుగుతున్న ఈ సమయంలో అస్పష్టంగా అశాస్త్రీయంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి అందులో 40 ప్రశ్నలు పొందుపరిచిందని అందులో మీరు ఎస్సీ నా ఎస్టీ నా అని అడిగారు కానీ మీరు ఓబిసి కి చెందిన వార అని మాత్రం అడగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక బీసీ ప్రధానిగా ఉన్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వానికి బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా బీసీ జాబితా ప్రకటించి కులాలకు ఒక కోడ్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య రాంబాబు యాదవ్ బంటు సైదులు, తాడూరీ సైదులు పాల్గొన్నారు.

# ణేష్ ఉత్సవాలపై మంత్రి పొన్నం కీలక పిలుపు..

# "ప్రజల భాగస్వామ్యంతోనే వేడుకలు"

### సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### భద్రత, పారిశుధ్యం, మండపాల నిర్వహణపై అధికారులతో సమీక్ష

### మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని.. పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నేటి ప్రస్థానం):** గణేష్ నవరాత్రి వేడుకలను ప్రజలు స్వచ్ఛందంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సామూహికంగా జరిగే వేడుకలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు మంత్రి వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. గణేష్ మండపాల వద్ద పారిశుధ్య నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర మౌలిక సదుపాయాలపై



సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. వినాయక మండపాలకు వచ్చే భక్తులకు మొక్కలను పంపిణీ చేయడంతో పాటు చేనేత కండువాలను వినియోగించేలా కార్యక్రమాలు చేపట్టాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులను కోరినట్లు మంత్రి తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని పొన్నం ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా ఉత్సవాలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బోనాల వేడుకల సమయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మంత్రి గుర్తుచేశారు. అదే విధంగా గణేష్ మండపాల్లోనూ ఎల్‌నినో ప్రభావం నుంచి ఉపశమనం లభించి, రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేయాలని ఉత్సవ సమితికి ప్రభుత్వం తరఫున సూచించినట్లు తెలిపారు.న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూనే సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజలు స్వయంగా ముందుకొచ్చి ఐక్యతతో, శాంతియుతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# సర్పంచుల సమస్యలపై జేఏసీ పోరాటం

### జిల్లా సర్పంచుల ఫోరం ...జేఏసీ జిల్లా అధ్యక్షులు జూకంటి అనిల్



**ఆలేరు, సెప్టెంబర్ 1 :** గ్రామపంచాయతీలు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ ఫోరం జేఏసీ జిల్లా అధ్యక్షుడు జుకంటి అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ సర్పంచుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని అన్ని మండలాలకు సర్పంచుల జేఏసీ మండల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సమావేశంలో గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (రాఖీజ) నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల నుంచి వివిధ పనుల రూపంలో వసూలు చేసిన జనరల్ ఫండ్‌ను ఫ్రీజింగ్‌లో ఉంచడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీజింగ్ తొలగించి, ఆ నిధులను గ్రామపంచాయతీల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అలాగే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎలాంటి పక్షపాతం లేకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీలకు సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడం, విద్యుత్ వోల్టేజ్ సమస్యలు తదితర కారణాలతో సర్పంచులపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు.త్వరలో జిల్లాలోని అన్ని మండలాలకు జేఏసీ కమిటీలను ఏర్పాటు చేసి, అనంతరం జిల్లా స్థాయి సభ నిర్వహిస్తామని తెలిపారు. గ్రామపంచాయతీలు, సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాన్ని చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.మండలాల వారీగా అధ్యక్షుల ఎన్నిక: రాజాపేట మండల జేఏసీ అధ్యక్షుడిగా పల్లె సంతోష్‌గౌడ్, యాదగిరిగుట్ట మండలానికి గౌడ మహేందర్, తుర్కపల్లి మండలానికి సీతరాజు, బొమ్మలరామారం మండలానికి గుడిమామిడి వెంకటేష్, గుండాల మండలానికి గడ్డమీది మహోదయగౌడ్, ఆత్మకూర్ మండలానికి ఎర్ర సోమిరెడ్డి, మోటకొండూర్ మండలానికి బెల్లి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కూర వెంకటేష్, ఆయా మండలాల సర్పంచ్ ఫోరం జేఏసీ నాయకులు, ఆలేరు మండల సర్పంచులు ధూపాటి వెంకటేష్, పరిధి మమతా సంతోష్, నర్సయ్య, బేధారబోయిన యాకమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్యాడర్ స్కీమ్ ప్రమోషన్లతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం

### ఆరుగురు ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేసిన మందమర్రి ఏరియా జీఎం

**మందమర్రిసెప్టెంబర్ 1:** సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు ఉద్యోగులకు క్యాడర్ స్కీమ్ కింద పదోన్నతి ఉత్తర్వులను ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ,ఉద్యోగ ధర్మాన్ని చక్కగా పాటించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఉద్యోగులు మరిన్ని ఉన్నత పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. పదోన్నతులు పొందిన వారిలో జూనియర్ అకౌంటెంట్లుగా (టి.అండ్.ఎస్. 'బి' నుంచి 'ఎ' గ్రూప్) పోతు రమ్యసుధ, ఆకునూరి సంపత్,అసిస్టెంట్ చైర్మన్‌లుగా (టి.అండ్.ఎస్. 'ఎఫ్' నుంచి 'ఈ' గ్రూప్) ఎస్.కె. తాజుద్దీన్,సిహెచ్.వెంకట కృష్ణంరాజు,ఆఫీస్ అటెండెంట్లుగా (టి.అండ్.ఎస్. 'హెచ్' నుంచి 'జి' గ్రూప్) సిరికొండ సీతమ్మ,ఆరుట్ల రమేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఏజీఎం (ఎఫ్అండ్ఏ) ఆర్.వి.ఎస్. ఆర్.కె.ప్రసాద్, డీజీఎం (సర్వే) బుఖ్య దేశాయ్, సీనియర్ పీఓ సురేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ (పర్సనల్) రాయలింగు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తలసేమియా,సికిల్‌సెల్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛాంబర్‌లో రాష్ట్రస్థాయి సమావేశం

### వినతిపత్రం అందజేసిన రెడ్‌క్రాస్ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి

**మంచిర్యాల,సెప్టెంబరు:** తలసేమియా,సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్న వైద్యానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టు గవర్నర్ దాన కిషోర్, ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా చైర్మన్లతో సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టు గవర్నర్ దాన కిషోర్,ఐఏఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావే



శంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పింఛన్ల ద్వారా బాధిత కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా లభిస్తుందని, మంజూరైన పింఛన్లను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. మంచిర్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని, తలసేమియా,సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని ఆయన వినతిపత్రంలో కోరారు. మంచిర్యాల పరిసర ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన రక్తాన్ని అందించడంతో పాటు తలసేమియా,సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు నిరంతర వైద్యసేవలు అందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ తనవంతు కృషిని కొనసాగిస్తుందని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఆయా జిల్లా శాఖల్లో కార్యవర్గ సభ్యుల పదవీకాలం పూర్తయిన చోట నిబంధనల ప్రకారం రెడ్‌క్రాస్ ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

# స్వాభిమానంతో జీవించేవాడే నిజమైన రాజు!


**మనిషి నిరంతరం ఏదో ఒక లక్ష్యం వైపు పరుగులు తీస్తూనే ఉంటాడు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆ పరుగు మరింత వేగవంతమైంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ధనం, పదవి, కీర్తి, అధికారం, సామాజిక హోదా వీటన్నింటిలోనూ మనం ఏదో ఒకదాన్ని సాధించడానికి నిరంతరం శ్రమిస్తూనే ఉంటాం. సమాజం కూడా వీటినే విజయానికి కొలమానాలుగా చూస్తోంది. కానీ, ఈ అంధకార పరుగులో మనం చాలాసార్లు మనకు తెలియకుండానే ఒక అత్యంత విలువైన సంపదను శాశ్వతంగా కోల్పోతాం.**

అదే మన ఆత్మగౌరవం.ఒక్కసారి అమ్ముడుపోయిన ఆత్మగౌరవం ఎంతటి కోట్లు కుమ్మరించినా మళ్ళీ తిరిగి రాదు. అందుకే మన పూర్వీకులు ఎంతో అనుభవంతో చెప్పారు.ఆత్మగౌరవం ఎట్టి పరిస్థితులలోను అమ్ముడుపోకూడదు అని. ఈ మాటలు కేవలం ఒక పాత సామెత కాదు, ఇవి ఒక అద్భుతమైన తాత్విక సత్యం. ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన ఒక ఉన్నతమైన జీవన సూత్రం మరియు మానవ ధర్మం.అసలు ఆత్మగౌరవం అంటే ఏమిటి? చాలామంది దీనిని గర్వంతో లేదా అహంకారంతో ముడిపెడతారు. కానీ నిజానికి ఆత్మగౌరవానికి, అహంకారానికి మధ్య చాలా సన్నని గీత ఉంది. అహంకారం అనేది పక్కవాడిని తక్కువ చేసి చూపిస్తే, ఆత్మగౌరవం అనేది తనను తాను గౌరవించుకునే నైతిక శక్తిని ఇస్తుంది. తన అంతర్గత నైతికతను, తన నిజాయితీని, తన స్వాభిమానాన్ని, తన మానవత్వాన్ని ఏ క్లిష్ట పరిస్థితిలోనూ వదులుకోకుండా నిలబడే ధైర్యమే ఆత్మగౌరవం.పాశ్చాత్య తత్వవేత్త ఇమ్మాన్యుయేల్ కాంట్ చెప్పినట్లుగా ప్రతి మనిషికీ అంతర్గతమైన ఒక అమూల్యమైన గౌరవం ఉంటుంది. దానిని ప్రపంచంలోని ఏ ధనమూ కొనలేదు, ఏ శక్తీ లేదా అధికారమూ చెరపలేదు. మన తెలుగు సమాజంలో కూడా ఈ విలువ ఎంతో ప్రాచీనమైనది, పవిత్రమైనది. పోతన భాగవతంలో ప్రహ్లాదుడు రాజైన తన తండ్రికే ఎదురు నిలిచాడు, ఎందుకంటే అతని ఆత్మగౌరవం కేవలం ధర్మంపై మాత్రమే ఆధారపడింది. అలాగే, మన కవులు ఎప్పుడో ప్రశ్నించారు ఆత్మ శుద్ధి లేని ఆచారమెందుకు? అని. ఈ నైతిక ప్రశ్న ఈనాటి ఆధునిక సమాజంలో కూడా ప్రతిధ్వనిస్తూనే ఉంది.మన నిత్య జీవితంలో ఆత్మగౌరవం అమ్ముడుపోయే క్షణాలు చాలా సూక్ష్మంగా, నిశ్శబ్దంగా వస్తాయి. ఒక్కొక్కసారి మనం వాటిని గమనించలేనంతగా మన దినచర్యలో భాగమైపోతాయి. వాటిని మనం గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.భయం వల్ల మారడం కార్యాలయంలో లేదా సమాజంలో ఒక ఉన్నతాధికారి ఎదుట స్పష్టమైన అన్యాయాన్ని చూస్తూ కూడా మౌనంగా ఉండటం. నా ఉద్యోగం పోతుందేమో, పైవాళ్ళు నన్ను ఇబ్బంది పెడతారేమో అని భయపడి సత్యాన్ని దాచడం ఆత్మగౌరవానికి మొదటి దెబ్బ. భయం మనిషిని బానిసను చేస్తుంది, కానీ ధైర్యం మాత్రమే మనిషిని మనిషిగా నిలబెడుతుంది.డబ్బు కోసం నీతిని వదలడం జీవితంలో ఒక్కసారి ఒక్క చిన్న అబద్ధం చెబితే చాలు, ఆ తర్వాత మరో అబద్ధం చెప్పడానికి మనసు చాలా సులభంగా ఒప్పుకుంటుంది. అలాగే, ఒక్కసారి అవినీతికి లొంగి లంచం తీసుకుంటే రెండోసారి అది ఒక అలవాటుగా మారిపోతుంది. ఈ నైతిక పతనంలో మన ఆత్మగౌరవం చిన్న చిన్న ముక్కలుగా అమ్ముడుపోతుంది.పొగడ్తల కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం ఎవరైనా మనల్ని పొగిడినప్పుడు లేదా మనకు లాభం చేకూరుస్తారని అనుకున్నప్పుడు మనం మన నిజమైన అభిప్రాయాలను మార్చేసుకుంటాం. తప్పును కూడా ఒప్పు అంటూ నిజాన్ని దాచిపెడతాం. ఇది పొగడ్త అనే ముఖచాయతో ఆత్మగౌరవాన్ని అమ్మేకోవడమే.సామాజిక ఒత్తిడికి తలొగ్గడం అందరూ ఆ తప్పు మార్గంలోనే వెళ్తున్నారు కదా, మనమొక్కరమే మారితే ఏం లాభం? అనే ధోరణి నేడు పెరిగిపోయింది. ఇది ముమ్మాటికీ ఆత్మగౌరవ హత్యే అవుతుంది. ఒక పెద్ద సమూహం అంతా కలిసి తప్పు చేసినా అది ఎప్పటికీ తప్పే అవుతుంది కానీ మెజారిటీ ఉందన్న కారణంతో అది ఒప్పుగా మారలేదు.చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే, ఆత్మగౌరవాన్ని కాపాడుకున్న మహానుభావులు ఎప్పటికీ చిరస్మరణీయులుగా నిలిచిపోయారు. దాన్ని అమ్ముకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారు.

**ఒక చిన్న పిల్లవాడు పాఠశాల బెంచీపై కూర్చుని పాఠాలు వింటున్నాడు. అప్పుడే ఉపాధ్యాయుడు క్లాసులోకి వచ్చి, పిల్లలూ, మీరు పెద్దయ్యాక ఏమవుతారు? అని అడిగారు. ఆ పిల్లాడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, తడుముకోకుండా, నేను డాక్టర్ అవుతాను అని సమాధానం ఇచ్చాడు. ఆ సమాధానంలో ఆ పిల్లాడికి తెలియని ఒక నిజం ఉంది ఆ మాట వాడు తన సొంత ఆలోచనతో చెప్పలేదు,ఇంట్లో తల్లిదండ్రులు ప్రతి రోజూ, ప్రతి సందర్భంలోనూ అదే నూరిపోస్తున్నారు. ఆ పిల్లాడి లేత మనసులో డాక్టర్ అవ్వాలనే కోరిక నిజంగా పుట్టిందా, లేక అది తల్లిదండ్రుల అసంపూర్ణ కలలకు ప్రతిరూపమా? ఈ ప్రశ్న కేవలం ఒక తరం సమస్య కాదు, ఇది మన సమాజంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన ఒక సంక్లిష్టమైన మానసిక చట్రం.**

# స్క్రిప్ట్ మారుద్దాం రండి

## మీ జీవితానికి అసలైన దర్శకుడు మీరే!




జీవిత లక్ష్యం ఇది మనిషి ఉనికికి మూలాధారం. దిశ లేని నావలా, లక్ష్యం లేని జీవితానికి అర్థం ఉండదు. కానీ, ఈ లక్ష్యాన్ని ఎవరు నిర్ణయిస్తున్నారు? మనం గీసుకున్న గీతా? లేక మన కుటుంబం, సమాజం, పరిస్థితులు మన కోసం గీసిన బాటనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడం అంటే మనలోని నిజమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకోవడమే. భారతీయ కుటుంబ వ్యవస్థలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో, పిల్లల భవిష్యత్తును నిర్ణయించే బాధ్యతను తల్లిదండ్రులు తమ భుజస్కంధాలపై వేసుకుంటారు. ఇందులో ఉన్నది స్వార్థం కాదు, అపారమైన ప్రేమ. నా కొడుకు సమాజంలో గొప్పగా బ్రతకాల,నా కూతురు ఆర్థికంగా స్థిరపడాలి అని వారు కనే కలలు వెనుక వారి సొంత అనుభవాలు, పడ్డ కష్టాలు ఉంటాయి. కానీ, కొన్నిసార్లు ఈ ప్రేమ పిల్లలకు కంచె లా మారుతుంది. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం, పిల్లలు తమ తల్లిదండ్రులను సంతోషపెట్టడం కోసం తమ ఇష్టాలను చంపుకున్నప్పుడు, వారిలో ఒక అంతర్గత శూన్యత ఏర్పడుతుంది. బయటకు చూసేవారికి వారు సక్సెస్ ఫుల్ అనిపించవచ్చు, ఉద్యోగంలో టాప్ పొజిషన్లో ఉండవచ్చు, మంచి జీతం రావచ్చు కానీ లోపల మాత్రం అసంతృప్తి తాండవిస్తుంది. ఎందుకంటే, వారు బ్రతుకుతున్నది తమ జీవితాన్ని కాదు, తల్లిదండ్రులు వారి కోసం రాసిన స్క్రిప్ట్ ని మాత్రమే. ఇలాంటి జీవితం మనసుకు తృప్తిని ఇవ్వదు, పైగా నిరంతరం ఏదో కోల్పోయామన్న భావనను మిగులుస్తుంది. ఇక్కడ తల్లిదండ్రులను పూర్తిగా నిందించలేం, ఎందుకంటే వారు చూసిన ప్రపంచంలో ఆర్థిక స్థిరత్వమే పరమార్థం. కానీ, మారుతున్న కాలంలో, కేవలం సెటిల్ అవ్వడం మాత్రమే జీవితం కాదని వారు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. కుటుంబం తర్వాత మన లక్ష్యాలను శాసించేది సమాజం. అందరూ చేస్తున్న పనినే నువ్వూ చేయి, అప్పుడే క్షేమం అని సమాజం నిరంతరం మనకు చెప్తూనే ఉంటుంది. ఒకప్పుడు డాక్టర్, ఇంజనీర్ అయితేనే గౌరవం అనుకునేవారు. ఇప్పుడు ఐటీ కంపెనీలో భారీ ప్యాకేజీతో సాఫ్ట్వేర్ ఇంజనీర్గా చేరడమో, లేక విదేశాలకు వెళ్ళడమో సక్సెస్ అంటే అదే అనే ముద్ర పడిపోయింది. మన సమాజంలో మనిషిని కొలిచేది మూడు ప్రశ్నలతోనే ఏం చదివావు?,ఎక్కడ ఉద్యోగం?,జీతం ఎంత? . ఒక చిత్రకారుడు తన కుంచెతో ప్రపంచాన్ని మార్చగలడు, ఒక రంగస్థల నటుడు సంభాషణలతో సమాజాన్ని మేల్కొల్పగలడు, ఒక రైతు తన కష్టంతో కోట్లాది మంది ఆకలి తీర్చగలడు. వీరందరికీ గొప్ప నైపుణ్యాలు ఉన్నా, సమాజం చూసే దృష్టిలో మార్పు లేదు. ఈ అసమాన దృక్పథమే యువతను తమ నిజమైన ప్రతిభను అణచివేసుకునేలా చేస్తోంది. కేవలం సమాజం మెచ్చుకుంటుందనో లేదా హోదా వస్తుందనో ఒక వృత్తిని ఎంచుకోవడం అంటే, మనలోని సృజనాత్మకతను మనమే చంపుకోవడమే బయట వినిపించే వేల గొంతుల మధ్య, మన లోపల నిరంతరం ఒక చిన్న గొంతు మాట్లాడుతుంది. అదే మన నిజమైన స్వ . ఆ గొంతు వినపడాలంటే నిశ్శబ్దం కావాలి, సాహసం కావాలి. నాకు నిజంగా ఏం నచ్చుతుంది?,ఏ పని చేస్తుంటే సమయం తెలియదు?,నా ఉనికి ఈ ప్రపంచానికి ఎలా దోహదపడుతుంది? ఇలాంటి ప్రశ్నలను మనం నిక్కచ్చిగా వేసుకోవాలి. సోక్రటీస్ అన్నట్టు, నీకు నీవు తెలియడం అన్నిటికన్నా గొప్ప జ్ఞానం. ఆ స్వయంజ్ఞానమే మీ లక్ష్యానికి పునాది. మీరు ఎందులో బలంగా ఉన్నారు, ఏది మీకు అసంతృప్తిని ఇస్తుంది అనేది మీరు అర్థం చేసుకున్నప్పుడే, లక్ష్యం మీ సొంతం అవుతుంది. ఇది సులభం కాదు, ఎందుకంటే మనం చాలా కాలం ఇతరుల అంచనాలను మన కోరికలుగా భ్రమపడ్డాం. ఆ భ్రమల తెరలను తొలగించుకోవడమే నిజమైన వ్యక్తిత్వ వికాసం. నేటి విద్యా వ్యవస్థ ఒక ఫ్యాక్టరీ లా మారింది. మార్కులు, ర్యాంకులు, ప్లేస్మెంట్స్, వీటి చుట్టే విద్య తిరుగుతోంది. ప్రశ్నించేతత్వం, సృజనాత్మకత వంటివి తరగతి గదుల్లో ఎండమావులయ్యాయి. ఇంటర్మీడియట్ విద్యార్థుల పరిస్థితిని గమనిస్తే, లక్షల మంది పోటీ పరీక్షల ఊబిలో చిక్కుకుంటున్నారు. తమకు నచ్చిన రంగం ఏంటో కూడా తెలుసుకోకముందే, భవిష్యత్తు బాగుంటుందనే ప్రచారంతో బలైపోతున్నారు. విద్య అనేది వ్యక్తిని మోక్షం వైపు లేదా జ్ఞానం వైపు తీసుకెళ్లాలి కానీ, కేవలం యాంత్రికమైన ఉద్యోగాల కోసం మాత్రమే కాకూడదు. చాలామంది అపోహ ఏమిటంటే, ఒక్కసారి లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే, దాని నుండి పక్కకు తప్పుకోవడం ఓటమి అని. ఇది చాలా తప్పు. లక్ష్యం అనేది పరిణామం చెందాలి. మీ అనుభవాలు పెరుగుతున్న కొద్దీ మీ దృక్పథం మారుతుంది, అది సహజం. స్టీవ్ జాబ్స్ వంటి ఎందరో గొప్ప వ్యక్తులు తమ జీవిత ప్రయాణంలో ఎన్నో మలుపులు తిరిగారు. పాతదాన్ని వదిలేసి, కొత్త లక్ష్యాన్ని ఎంచుకోవడం బలహీనత కాదు, అది మీ పరిపక్వతకు నిదర్శనం. లక్ష్యం అంటే కేవలం మీ వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదు. మీ విజయం సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది కూడా ముఖ్యం. బి.ఆర్. అంబేద్కర్, గాంధీ వంటి మహనీయుల జీవితాలను చూడండి. వారి వ్యక్తిగత లక్ష్యాలు, సామాజిక శ్రేయస్సుతో ముడిపడి ఉన్నాయి. అందుకే వారు శతాబ్దాలు దాటినా ఇంకా ప్రేరణగా నిలిచారు. మీ లక్ష్యం కుటుంబం కోసమో, సమాజం కోసమో లేదా దేశం కోసమో ఉండవచ్చు కానీ అది మీ సొంతం కావాలి. జీవితం ఒక తెరిచిన పుస్తకం. అందులో మొదటి కొన్ని పేజీలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం రాశారు. అది సరే, కానీ ఆ పుస్తకం ఇప్పుడు మీ చేతిలో ఉంది. మిగిలిన పేజీలను మీరే రాయాలి. ఇతరులు రాసిన పేజీలను చూసి నిందించడం వల్ల ప్రయోజనం లేదు,అవి మిమ్మల్ని ఆకారపరిచాయి, అంతే. నిజంగా జీవించడం అంటే ఇతరుల అంచనాల కోసం బ్రతకడం కాదు, మన గొంతును మనం వినడం. కాబట్టి, ఈ రోజే ఒక్క క్షణం ఆగి ఆలోచించండి,ఈ జీవితం నిజంగా నాదా? లేక నాకు ఎవరో గిఫ్ట్గా ఇచ్చిన అంచనా పత్రమా? ఈ ప్రశ్నకు జవాబు వెతకడమే మీ అసలైన జీవన యాత్రకు శ్రీకారం. మీ కోసం మీరు జీవించడం మొదలుపెట్టిన రోజే, జీవితం నిజంగా అర్థవంతంగా, పరిపూర్ణంగా మారుతుంది.

# ఆనందం ఎక్కడ ఉంది?

**ఒక పసిపాప చేతిలో రంగురంగుల బుడగ పట్టుకుని ఆనందంతో కిలకిలా నవ్వుతోంది. ఆ రంగుల ప్రపంచాన్ని చూసి ఆమె కళ్ళు అమాయకత్వంతో వెలిగిపోతున్నాయి. కానీ, అంతలోనే ఒక చిన్న గాలి విసురుకో, లేక చిన్న ముల్లు తాకడమో జరిగింది. ఆ బుడగ క్షణంలో పగిలిపోయింది. మరుక్షణమే ఆ పసిపాప పెదవులపై ఉన్న నవ్వు మాయమై, కన్నీళ్లుగా మారిపోయింది.ఈ చిన్న, నిత్య జీవిత దృశ్యంలోనే మానవ ఉనికికి సంబంధించిన ఒక అతిపెద్ద, జవాబు లేని ప్రశ్న దాగి ఉంది అసలు ఆనందం అంటే ఏమిటి? అది మన జీవితంలో శాశ్వతంగా నిలుస్తుందా, లేక ఆ గాలి బుడగలాగే క్షణికమైనదా? యుగయుగాలుగా తత్వవేత్తలు, సాధువులు, ఆధునిక శాస్త్రవేత్తలు సైతం ఈ రంగుల బుడగ వెనుక ఉన్న రహస్యాన్ని, ఆనందం యొక్క అసలు చిరునామాను వెతుకుతూనే ఉన్నారు. మానవ మనసును నిరంతరం తొలిచే ఈ అన్వేషణలో మనం కూడా కాస్త లోతుగా ప్రయాణించి చూద్దాం.మనం సాధారణంగా ఆనందాన్ని ఒక అద్భుతమైన అనుభూతిగా భావిస్తాం.**

అనుకున్న కోరిక తీరినప్పుడు కలిగే తృప్తి, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రియమైనవారిని కలిసినప్పుడు గుండెల్లో నిండే సంతోషం, సమాజంలో ఒక పెద్ద విజయం సాధించినప్పుడు కలిగే గర్వం ఇవన్నీ మనకు ఆనందాన్ని ఇస్తాయి. కానీ ఈ అనుభూతులన్నింటికీ ఒక ఉమ్మడి బలహీనత ఉంది. అవన్నీ వచ్చి పోతుంటాయి. నిన్న మనల్ని ఎంతగానో సంతోషపెట్టిన వస్తువు, ఈరోజు అంతగా ఉత్తేజపరచకపోవచ్చు.

మనం ఎంతో ఇష్టపడి, కష్టపడి కొనుక్కున్న సరికొత్త వాహనం మొదటి వారం రోజులు ఇచ్చే ఆనందం వేరు. కానీ ఆరు నెలలు గడిచేసరికి, అది కేవలం ఒక నిత్యకృత్యంగా, మామూలు విషయంగా మారిపోతుంది. మానవ మనస్తత్వశాస్త్రవేత్తలు ఈ వింత ప్రవర్తనను హెడోనిక్ అడాప్టేషన్ అని పిలుస్తారు. అంటే, మనిషి ఎంతటి గొప్ప సుఖాన్ని లేదా వైభవాన్ని పొందినా, కొంతకాలానికి మానసికంగా దానికి పూర్తిగా అలవాటుపడిపోతాడు. ఆ తర్వాత మళ్ళీ తన పాత సాధారణ స్థితికే చేరుకుంటాడు. ఈ మానసిక వాస్తవమే అసలు ఆనందం శాశ్వతమేనా? అనే అంతర్గత ప్రశ్నకు మూలబీజం వేస్తుంది.పురాతన గ్రీకు మహాతత్వవేత్త అరిస్టాటిల్ మానవ ఆనందాన్ని రెండు స్పష్టమైన రకాలుగా విభజించాడు. మొదటిదితాత్కాలిక ఇంద్రియ సుఖం లేదా క్షణిక ఆనందం, దీన్ని ఆయన హెడోనియా అన్నాడు. రెండూ అర్థవంతమైన, బాధ్యతాయుతమైన జీవనం ద్వారా లభించే గాఢమైన ఆత్మతృప్తి, దీనిని ఆయన యూడైమోనియా అని పిలిచాడు. అరిస్టాటిల్ దృష్టిలో, కేవలం భౌతిక సుఖాలను వెంటాడటం వల్ల వచ్చే ఆనందం ఎప్పుడూ తాత్కాలికమే. కానీ సమాజంలో సద్గుణంతో, ఆదర్శవంతమైన విలువలతో జీవించడం ద్వారా లభించే ఒక లోతైన సంతృప్తి మాత్రమే మనిషి జీవితంలో దీర్ఘకాలం నిలుస్తుంది. అతని శిష్యపరంపరలో వచ్చిన ఎపిక్యూరియన్ తత్వవేత్తలు కూడా, నిజమైన ఆనందం విచ్చలవిడి భోగలాలసతలో లేదు, మన కోరికలను నియంత్రించుకోవడంలోనే ఉందని బలంగా బోధించారు.మరోవైపు రోమన్ స్టోయిక్ తత్వవేత్తలైన సెనెకా, ఎపిక్టేటస్, మార్కస్ ఆరేలియస్ ఈ విషయంపై మరో అడుగు ముందుకేసి మాట్లాడారు. బాహ్య పరిస్థితులపై, ఇతరుల ప్రవర్తనపై ఆధారపడిన ఆనందం ఎన్నడూ స్థిరంగా ఉండదని వారు స్పష్టం చేశారు. మనిషి తన అంతరంగాన్ని, ఆలోచనలను క్రమశిక్షణలో ఉంచుకున్నప్పుడే నిజమైన మనశ్శాంతి సాధ్యమవుతుందని వారు వాదించారు. , మనం నియంత్రించలేని విషయాలైన ధనం, కీర్తి, సమాజపు గుర్తింపు మీద ఆధారపడిన ఆనందం ఎప్పటికీ అశాశ్వతమే.

భారతీయ తత్వశాస్త్రం ఈ ఆనంద సిద్ధాంతాన్ని మరింత ఆధ్యాత్మిక లోతులతో చర్చించింది. మన వేదాంత దర్శనం ప్రకారం, మనం నిత్య జీవితంలో అనుభవించే సుఖదుఃఖాలు కేవలం మన మనసుకు, శరీరానికి సంబంధించిన తాత్కాలిక సంచలనాలు మాత్రమే. కానీ మనిషి యొక్క అసలు స్వరూపం అయిన ఆత్మ అనేది సత్-చిత్-ఆనంద స్వభావం కలిగినది. అంటే, ఆనందం అనేది మనం బయటి ప్రపంచంలో, వస్తువుల్లో వెతుక్కునే పరాయి వస్తువు కాదు, అది మనలోనే ఉన్న మన సొంత అంతర్గత స్వభావం. బాహ్య వస్తువుల ద్వారా వచ్చే సుఖం కాలంతో పాటు కరిగిపోయినా, మన అంతరంగ నిజస్వరూపాన్ని మనం గుర్తించినప్పుడు లభించే ఆనందం మాత్రం ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతుందని ఈ సనాతన దర్శనం చెబుతోంది.గౌతమ బుద్ధుడు ఈ ఆనంద విషాదాల ప్రశ్నకు మరింత ప్రాక్టికల్ సమాధానం ఇచ్చాడు. ఈ విశ్వంలో శాశ్వతమైనది ఏదీ లేదని, ప్రతి క్షణం ప్రతిదీ మార్పుచెందుతూనే ఉంటుందని ఆయన బోధించిన అనిత్య సూత్రం స్పష్టం చేస్తోంది. సుఖమైనా, తీవ్రమైన దుఃఖమైనా రెండూ కాలప్రవాహంలో కొట్టుకుపోయే తాత్కాలిక అలలే. మనం ఈ అశాశ్వత ప్రపంచంలో శాశ్వత సుఖం కోసం పట్టుబట్టి వెంపర్లాడటమే మానవాళి ఎదుర్కొంటున్న నిజమైన దుఃఖానికి మూలకారణం అని బుద్ధుని ప్రధాన బోధన.

ఎందుకంటే, స్వభావరీత్యా శాశ్వతం కాని ఒక వస్తువును లేదా బంధాన్ని శాశ్వతం చేయాలని ప్రయత్నించడం ఒక వ్యర్థమైన పోరాటం. దీనికి బదులుగా, ప్రకృతిలో జరిగే నిరంతర మార్పును సహజంగా అంగీకరించడం, ప్రతి క్షణాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించడం నేర్చుకుంటే, మనసులోని ఆరాటం తగ్గి ఒక అద్భుతమైన సమతుల్య మనశ్శాంతి లభిస్తుంది.నేటి ఆధునిక శాస్త్రీయ పరిశోధనలు కూడా మన పురాతన ఋషుల జ్ఞానాన్నే శాస్త్రీయంగా ధృవీకరిస్తున్నాయి. పాజిటివ్ సైకాలజీ (సానుకూల మనస్తత్వశాస్త్రం) చేసిన సామాజిక అధ్యయనాల ప్రకారం, ఊహించని విధంగా లాటరీ తగిలి కోటీశ్వరులైన వారైనా, లేదా ఒక దురదృష్టకరమైన ప్రమాదంలో తమ శరీర అవయవాన్ని కోల్పోయిన వారైనా కొన్ని నెలల కాలం గడిచిన తర్వాత వారి దైనందిన ఆనంద స్థాయి మళ్లీ మునుపటి పాత స్థితికే చేరుకుంటుందని తేలింది. దీనినే శాస్త్రవేత్తలు హెడోనిక్ సెట్ పాయింట్ అంటారు.అంటే, జీవశాస్త్రపరంగా ప్రతి మనిషికి ఒక సహజమైన, అంతర్లీన ఆనంద స్థాయి ఉంటుంది. బాహ్య ప్రపంచంలో జరిగే మంచి చెడు సంఘటనలు ఆ స్థాయిని తాత్కాలికంగా పైకి కిందికి కదిలించినా, కొంతకాలానికి మానసిక వ్యవస్థ మళ్ళీ తన పాత మూల స్థానానికి తిరిగివస్తుంది. ఈ ఆధునిక కోణంలో చూసినా, శాశ్వత ఆనందం అనేది ఏదో ఒక బాహ్య సంఘటన ద్వారా లేదా వస్తువు ద్వారా సాధించగలిగేది కాదు. అది ఒక నిరంతర జీవనశైలి, మనసును మలచుకునే ఒక అద్భుతమైన మానసిక అలవాటు.ఈ విభిన్న దర్శనాలను, శాస్త్రీయ కోణాలను లోతుగా పరిశీలించాక మనకు అర్థమయ్యే పరమ సత్యం ఏమిటంటే బాహ్య పరిస్థితుల మీద లేదా ఇతరుల మెప్పుదల మీద ఆధారపడిన ఏ ఆనందమూ ఎన్నటికీ శాశ్వతం కానేరదు. డబ్బు, హోదా, పదవి, ప్రశంసలు, లౌకిక సంబంధాలు ఇవన్నీ మనకు తాత్కాలికంగా క్షణికమైన సంతోషాన్ని ఇవ్వగలవే తప్ప, గుండెల్లో శాశ్వత తృప్తిని నింపలేవు. కానీ అదే సమయంలో, మానవ హృదయంలో ఒక చెక్కుచెదరని లోతైన శాంతి సాధ్యమేనని ఈ తత్వాలన్నీ ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి.ఆ నిజమైన శాంతి బయట ఎక్కడో దొరికేది కాదు, మన అంతరంగంలో రోజువారీ సాధనతో పెంపొందించుకోవలసినది. ఉన్నదానితో సంతృప్తి చెందడం, తోటివారి పట్ల కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండటం, అనవసరమైన గతంలోనో లేదా ఊహాజనిత భవిష్యత్తులోనో కాకుండా ఈ వర్తమాన క్షణంలో జీవించడం ఇవి అలవాటు చేసుకుంటే, బాహ్య ప్రపంచం ఎంతగా మారినా మన మనసు గాయపడదు.మానవ జీవితంలో ఆనందాన్ని ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటిది భౌతిక ఆనందం (హెడోనియా). ఇది స్వభావరీత్యా తాత్కాలికం మరియు క్షణికమైనది, లగ్జరీ వస్తువులు, శారీరక సుఖాలు, మరియు బాహ్య ప్రపంచంలో సాధించే విజయాల ద్వారా ఇది లభిస్తుంది.



# ప్రముఖ కార్ల కంపెనీ సంచలన నిర్ణయం!

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టెస్లా ఏకంగా 30 లక్షల కార్లకు రీకాల్ ప్రకటించింది. ఈ విషయాన్ని చైనా అధికారులు వెల్లడించారు. కంపెనీ రీకాల్ ప్రకటించడానికి కారణం ఏమిటనే విషయాన్ని ఈ కథనంలో చూసేద్దాం.డోర్ హ్యాండిల్ భద్రతకు సంబంధించిన సమస్య కారణంగా.. అమెరికా కార్ల తయారీ సంస్థ మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్ ఎస్ సహా చైనాలో తయారైన, దిగుమతి చేసుకున్న సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోందని చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ తెలిపింది.చైనా మీడియా ప్రకారం.. ఈ సంవత్సరంలో ఇదే అతిపెద్దదైన ఈ రీకాల్. టెస్లా ఎలక్ట్రిక్ వాహనాలు, అనేక చైనీస్ ఈవీ మోడళ్లలో సాధారణంగా కనిపించే లోపలికి ఉన్న కార్ డోర్ హ్యాండిల్స్‌ను వచ్చే ఏడాది నుంచి నిషేధిస్తామని చైనా అధికారులు ఫిబ్రవరిలో ప్రకటించిన తర్వాత ఈ భారీ రీకాల్ ప్రకటన వెల్లడైంది. దేశంలో అనేక చోట్ల జరిగిన ఈవీల ప్రమాదాల నేపథ్యంలో.. చైనా ఇటీవల ఫ్లష్ కార్ డోర్ హ్యాండిల్స్‌పై నిఘాను ముమ్మరం చేసింది. ఈ ప్రమాదాలలో కార్లలోని ఎలక్ట్రానిక్ డోర్లు విఫలమై, ప్రజలు లోపల చిక్కుకుపోయారు. చైనా నియంత్రణ సంస్థ వెబ్‌సైట్‌లోని ఒక ప్రకటనలో.. భద్రతకు సంబంధించిన ప్రమాదాన్ని ప్రస్తావించింది. ఎలక్ట్రిక్ వ్యవస్థ వైఫల్యానికి కారణమయ్యే తీవ్రమైన ప్రమాదం వంటి తీవ్రమైన పరిస్థితులలో.. కారు హ్యాండిల్స్, కారు వినియోగదారులు తప్పించుకోవడానికి తలుపులు త్వరగా ఓపెన్ కాకుండా అడ్డుకోవచ్చని, లేదా కారు బయట ఉన్న సహాయక సిబ్బంది లోపలికి ప్రవేశించకుండా నిరోధించవచ్చని ఆ ప్రకటన పేర్కొంది. పరిశ్రమలోని కొంతమంది నిపుణులు వాహన తయారీదారులు డిజైన్ కంటే భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్షు, ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ అభివృద్ధిలో ఈ రీకాల్‌ను 'ఒక అనివార్యమైన అడుగు' అని అభివర్ణించారు.

# పిల్లల ఆధార్‌పై బిగ్ అప్డేట్!




పిల్లలకు ఆధార్ కార్డు ఉంది అంటే.. మాత్రమే సరిపోదు. వాళ్లు పెరుగుతున్న కొద్దీ.. ఆధార్‌లోని బయోమెట్రిక్ వివరాలను కూడా తప్పకుండా అప్‌డేట్ చేయాలి. చిన్న పిల్లలకు ఆధార్ తీసుకునే సమయంలో వేలిముద్రలు, కంటి ఐరిస్ వివరాలు నమోదు చేయరు. కాబట్టి, పిల్లలకు 5 ఏళ్లు వచ్చిన తర్వాత వీటిని అప్‌డేట్ చేయడం తప్పనిసరి. ఇటీవల యూఐడీఏఐ దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో 2 కోట్లకు పైగా మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్స్ (వీదీఖ) పూర్తయ్యాయి. 2025 సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా 1.56 లక్షలకు పైగా పాఠశాలలను కూడా కవర్ చేశారు.

**వీదీఖ అంటే ఏంటి?**

చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేసేటప్పుడు సాధారణంగా వారి పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాలతో పాటు ఫొటో తీసుకుంటారు. కానీ.. ఐదేళ్లలోపు పిల్లల వేలిముద్రలు, ఐరిస్ వివరాలను నమోదు చేయరు. పిల్లలు పెరిగే కొద్దీ వారి బయోమెట్రిక్ వివరాలను ఆధార్‌లో చేర్చాల్సి ఉంటుంది. దీనినే మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్స్ అంటారు. పిల్లలకు ప్రధానంగా రెండుసార్లు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి. మొదట 5 ఏళ్లు పూర్తయిన తర్వాత, రెండోసారి 15 ఏళ్లు పూర్తయిన తర్వాత అప్‌డేట్ చేయాలి. ఈ సమయంలో వేలిముద్రలు, ఐరిస్ స్కాన్‌తో పాటు లేటెస్ట్ ఫొటోను కూడా ఆధార్‌లో అప్‌డేట్ చేస్తారు.

**పిల్లలకు ఉచితమేనా?**

ప్రస్తుతం 5 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌పై ఫీజు మినహాయింపు ఉంది. 2026 సెప్టెంబర్ 30 వరకు వర్తించే నిబంధనల ప్రకారం ఈ అప్‌డేట్‌ను ఉచితంగా చేసుకోవచ్చు.

2025 అక్టోబర్ 1 నుంచి 7-15 ఏళ్ల పిల్లలకు వీదీఖ ఛార్జీలను ఒక సంవత్సరం పాటు యూఐడీఏఐ మాఫీ చేసింది. 5-7 ఏళ్లు, 15-17 ఏళ్ల పిల్లలకు కూడా వీదీఖ ఉచితంగానే కొనసాగుతోంది. కాబట్టి.. ప్రస్తుతం అర్హత ఉన్న పిల్లల తల్లిదండ్రులు బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

**అప్‌డేట్ చేయకపోతే ఇబ్బందులు వస్తాయా?**

పిల్లల ఆధార్ బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయకపోతే భవిష్యత్తులో కొన్ని సందర్భాల్లో అథెంటికేషన్ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు ప్రభుత్వ పథకాలు, స్కాలర్‌షిప్‌లు, విద్యకు సంబంధించిన సేవలు, అలాగే చీజుజు, జీజుజు, జఖజు వంటి పరీక్షల సమయంలో ఆధార్ ఆధారిత గుర్తింపు అవసరం కావచ్చు. కేవైసీ వంటి ఇతర సేవల్లోనూ ఆధార్ అథెంటికేషన్ ఉపయోగిస్తారు. పిల్లలు పెరిగిన తర్వాత పాత బయోమెట్రిక్ వివరాలతో అథెంటికేషన్ చేయడంలో సమస్యలు రాకుండా ఉండేందుకు సరైన సమయంలో వీదీఖ చేయించడం మంచిది.

**ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ ఎలా చేయాలి?**

ఈ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లో చేయలేరు. పిల్లలను తప్పనిసరిగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌కు తీసుకెళ్లాలి. కాబట్టి.. ముందుగా సమీపంలోని ఆధార్ కేంద్రాన్ని గుర్తించాలి. దీనికోసం భువన్ ఆధార్ పోర్టల్ ఉపయోగించవచ్చు. కేంద్రానికి వెళ్లేటప్పుడు పిల్లల ఆధార్ నెంబర్‌ను వెంట తీసుకెళ్లడం మంచిది. అక్కడ పిల్లల వేలిముద్రలు, ఐరిస్ స్కాన్, ఫొటో తీసుకుంటారు.

# రిటర్నులు వేశాక ఏం చేయాలి..

2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను 2026 జూలై 31 గడువు లోపలే ఆదాయపు పన్ను రిటర్నులు వేసినందుకు సంతోషం. ఒక పెద్ద పని అయిపోయింది. నిజమే..ఒక పెద్ద బాధ్యత నెరవేర్చినట్లే. అయితే, "ఇల్లు అలకగానే పండుగ కాదు" అనే పాతకాలం సామెతలాగా, ఫైల్ చేయడం పూర్తయిపోయినా.. ఇంకా చేయాల్సిన పనులు కొన్ని ఉంటాయి. యువకిశోరం అర్జున్ జూలైలో గడువు ముగిసేలోగానే ఫారంని క్లిక్ చేసి, సబ్మిట్ చేసేశాడు. కానీ, పాన్, ఆధార్ కార్డుతో అనుసంధానం కాకపోవడం వల్ల ఫారం ఎ మీద సంతకం పెట్టి, బెంగళూరులో అధికారులకు పంపడం మాత్రం మరిచిపోయాడు. 30 రోజుల్లోపల 'వేలిడేట్' చేయకపోవడం వల్ల రిటర్ను చెల్లదు. డిఫెక్టివ్ రిటర్న్ అవుతుంది. రిటర్న్ వేయటానికి ముందే పాన్, ఆధార్ లింక్ చేసుకోవాలి. లేదా కనీసం రిటర్న్ వేసిన వెంటనే లింక్ చేసి, ఓటీపీ ద్వారా రిటర్నులను 'వేలిడేట్' చేసుకోవచ్చు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల జాప్యం అయితే, వెంటనే ఫారం ఎ.. అంటే 'అక్నాలెడ్జ్‌మెంట్'ను స్వయంగా సంతకం పెట్టి, ఆ కాగితాన్ని బెంగళూరుకు పంపాలి. 30లోపల వారికి అందాలి. ఫారం ఎలో అన్ని వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఇలా 'వెరిఫికేషన్' ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయండి. నెట్ బ్యాంకింగ్ ద్వారా ఎలక్ట్రానిక్‌గా వేలిడేట్ చేసుకోవచ్చు. బ్యాంకు అకౌంటుని ముందుగానే తెలియజేసి, తద్వారా కూడా వేలిడేట్ చేయొచ్చు. డీమ్యాట్ ద్వారా ఒక మార్గం. ఇక పాన్--ఆధార్ అనుసంధానం మంచి మార్గం. ఇవీ కాకుంటే ఫారం ఎని సంతకం పెట్టి పోస్ట్ చేయడం మరో మార్గం.

**వెరిఫై అయితేనే ప్రాసెసింగ్..**

రిటర్ను వేసినప్పటి నుంచి ఘడియలు లెక్కపెడతారు కొందరు .. రిఫండు కోసం. రిఫండు ఇంకా రాలేదని వాపోతారు మరికొంత మంది. వెరిఫై అయిన తర్వాతే మొదలవుతుంది అసెస్‌మెంటు. అంతవరకూ ముట్టుకోరు.

**ఏవైనా తప్పులు దొర్లాయా..**

గడువు తేదీ నాడు వేసేయాలన్న తొందరలో ఏవైనా తప్పులు దొర్లాయా? ఏదైనా ఆదాయం మరచిపోయారా? టీడీఎస్ తక్కువ జమ అయిందా.. ఆదాయ వర్గీకరణలో తప్పు జరిగిందా.. మీ యజమానికి లెక్కల్లో పొరపాట్లు




ఏర్పడ్డాయా.. క్యాపిటల్ గెయిన్స్ లెక్కల్లో తప్పులు దొరికాయా.. ఇలాంటి ఎన్నో పరిస్థితులు ఏర్పడితే గాభరాపడొద్దు. మీరు మీ రిటర్నులను రివైజ్ చేసుకోవచ్చు. ఒక ఉదాహరణ.. ప్రాక్టికల్ కేసు. ఒక అసెస్సీ బ్యాంకులో జూలై 31నాడు సెల్ఫ్ అసెస్‌మెంట్ చలానాలను ఉదయం 10 గంటలకు బ్యాంకులో జమచేశారు. కానీ సాయంకాలం రికార్డులలో అప్‌డేట్ కాలేదు. అయితే అన్ని వివరాలను పొందుపరుస్తూ, చలాన్ చెల్లించినట్లు రిటర్న్ వేసేశారు. దీని వల్ల లేటు ఫీజు పడలేదు. ఆగస్టు 1నాడు రికార్డుల్లో అప్‌డేట్ అయిన తర్వాత రిటర్న్ రివైజ్ చేసి, దాఖలు చేశారు. ఎలాంటి అదనపు ఖర్చు లేదు. రివైజ్ చేయడం వల్ల పన్ను భారం పెరిగితే దాన్ని చెల్లించాలి. ఇందుకు గడువు తేది 2026 డిసెంబర్ 31. ఇక డిపార్టుమెంటు వారి వంతు. బంతి వారి చేతిలో ఉంది. వారు ప్రాసెసింగ్ మొదలుపెట్టి, ఆర్డర్లు పాస్ చేస్తారు. ఈ విషయాన్ని తెలిపే ఆర్డరు/వర్తమానం.. పాత చట్టం ప్రకారం 143 (1).. కొత్త చట్టంలో 270 (1) కింద వస్తుంది. వారానికొకసారి మీరు పోర్టల్‌లో ఈ సమాచారం కోసం ఎదురుచూడండి. ముందుగా మీకు మెసేజ్ వస్తుంది. ఈ సమాచారంలో ప్రాసెసింగ్ పూర్తి అయ్యిందని, సమాచారం పంపుతామని ఉంటుంది. అలా అన్న వెంటనే పంపరు కానీ.. తొందరలోనే వస్తుంది.ఇప్పుడేం చేయాలి..

మీరు వేసిన రిటర్నుల్లో ఆదాయం, పన్ను భారంలో ఎలాంటి తేడాలు లేకపోతే, మీరు వేసిన దానితో సమ్మతిస్తున్నట్లు చెప్తారు. పన్నుభారం కన్నా ఎక్కువ పన్ను చెల్లిస్తే మీకు రిఫండు ఇస్తారు. రిఫండు తగ్గొచ్చు, పెరగవచ్చు. అయితే ప్రతి మార్పుకి/తేడాకి వివరణ ఇస్తారు. ఆదాయంలో మార్పులు రావొచ్చు. లెక్కింపుల్లో తప్పులు రావొచ్చు. పన్ను భారం మారవచ్చు. చెల్లించిన పన్నుల ఎంట్రీలు పూర్తిగా ఉండకపోవచ్చు. ఆ మేరకు లెక్కలు మారవచ్చు. ఏయే మార్పులు వచ్చాయో వాటిని గమనించండి. వాటిని విశ్లేషించండి. అవి తప్పనిపిస్తే వాటితో విభేదించండి. అయితే, ప్రతి దానికి, వివరణ, సంజాయిషీ ఉండాలి. రిఫండు వస్తే సంతోషం. లేదా కారణాలను విశ్లేషించండి. సరైన జవాబు ఇవ్వండి. దీనితో ఈ కథ ముగిసినట్లే. కథ కంచికి. మనం ఇంటికి. అంతటితో ఆ కథకు ముగింపు పలికి, ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరం గురించి ఆలోచిద్దాం.

# రూ.లక్షల కోట్ల ఆదా సరే.. మైలేజ్ కోతకు పరిష్కారమేది?

**భారతదేశం ఇంధన స్వావలంబన వైపు వేగంగా అడుగులు వేస్తోంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ) ప్రకారం, 2013-14లో 1.53% ఉన్న ఇథనాల్ బ్లెండింగ్ 2025-26 నాటికి 20% (ఈ20)కి చేరింది. దీనివల్ల రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవ్వడంతోపాటు రైతులకు రూ.1.66 లక్షల కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయి.**




అయితే, హారాల్డ్ లాస్‌వెల్ (1956), చార్లెస్ లిండ్‌బ్లోమ్ (1959) సిద్ధాంతాలు(ప్రభుత్వం ఎలా నిర్ణయాలు తీసుకోవాలో చెప్పే సిద్ధాంతాలు) పేర్కొన్నట్లు.. విధాన రూపకల్పనలో కేవలం లక్ష్య సాధనే కాకుండా, అమలులో ఎదురయ్యే అనుభవాల ఆధారంగా సర్దుబాట్లు చేసుకోవడం చాలా ముఖ్యం.

**ప్రధాన సవాళ్లు.. వినియోగదారుల భారం**

పాత వాహనాల్లో ఈ20 అనుకూలతపై స్పష్టమైన అంచనా లేదని, వీటిలో మైలేజ్ 3--5% తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం రాజ్యసభలో తెలిపింది. బంకుల్లో పాత ఇంధనం దొరక్కపోవడంతో వినియోగదారులు మైలేజ్ కోతను, విడిభాగాల అరుగుదల వ్యయాన్ని తప్పనిసరిగా భరించాల్సి వస్తోంది. ఇథనాల్ శాతాన్ని పెంచడానికే ప్రాధాన్యమివ్వడంతో వాహనదారుల ప్రయోజనాలు, వాహనాల సన్నద్ధత ప్రాధాన్యం కోల్పోయాయి.

**అంతర్జాతీయ పాఠాలు**

బ్రిటన్ ఈ10ను ప్రవేశపెట్టినప్పుడు పాత వాహనాల కోసం ఈ5ని 'ప్రొటెక్షన్ గ్రేడ్'గా కొనసాగించి వాహన అనుకూలతను సరిచూసుకునే సదుపాయం కల్పించింది. వినియోగదారులు లేవనెత్తుతున్న మైలేజ్, వారంటీ సమస్యలను అపోహలుగా కొట్టిపారేయకుండా ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కేవలం ఇంధనంలో ఇథనాల్ కలిపే శాతాన్నే కాకుండా నీటి వినియోగం, ఇతర ఉద్గారాలను ప్రాతిపదికగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అనుభవాల ఆధారంగా విధానాన్ని సరళంగా సవరించుకోవడమే నిజమైన పరిపాలనా సామర్థ్యమని చెబుతున్నారు.

# సంతకం చేయనందుకు ఉద్యోగం పోయిందా?




మెటా ప్లాట్‌ఫామ్స్‌కు చెందిన మాజీ ప్రొడక్ట్ డిజైన్ మేనేజర్ 'జేమ్స్ టిల్లింగ్‌హాస్ట్'.. తనను కంపెనీ అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించిందని ఆరోపిస్తూ కేసు దాఖలు చేశారు. తన సహోద్యోగి గ్రీన్ కార్డు దరఖాస్తుకు సంబంధించిన ఒక ఇమ్మిగ్రేషన్ డాక్యుమెంట్ మీద సంతకం చేయడానికి నిరాకరించిన తర్వాతే సమస్యలు మొదలయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**వివాదం ఎలా మొదలైంది?**

న్యూజెర్సీ ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టులో దాఖలు చేసిన దావా ప్రకారం.. 2024లో మెటా ఇమ్మిగ్రేషన్ లీగల్ టీమ్, తన విభాగంలోని ఒక ఉద్యోగికి సంబంధించిన గ్రీన్ కార్డ్ దరఖాస్తుకు (జుదీ-2 నేషనల్ ఇంటరెస్ట్ వేవర్) మద్దతుగా ఒక సిఫార్సు లేఖపై సంతకం చేయమని టిల్లింగ్‌హాస్ట్‌ను కోరడంతో ఈ వివాదం ప్రారంభమైంది. ముసాయిదా లేఖలో ఆ ఉద్యోగి మెటా కోసం సుమారుగా 638 మిలియన్ డాలర్ల అదనపు ప్రకటనల ఆదాయాన్ని సంపాదించిపెట్టాడని, కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అల్గారిథం సాధనాలను నేరుగా అభివృద్ధి చేశాడని, పెద్ద బహుళ-కార్యాత్మక బృందాలకు నాయకత్వం వహించాడని ఆరోపించినట్లు తెలుస్తోంది.

**లేఖలోని విషయాలపై అభ్యంతరం**

ఆ లేఖలోని కొన్ని విషయాలు అతిశయోక్తిగా, వాస్తవ ఆధారాలు లేనివిగా టిల్లింగ్‌హాస్ట్‌కు అనిపించాయి. అందుకే తాను నిజమని నమ్మి ధృవీకరించగలిగే అంశాలను మాత్రమే ఉంచేలా లేఖను మార్చినట్లు ఆయన చెబుతున్నారు. అయినప్పటికీ, ఆ లేఖపై సంతకం చేయడానికి ఆయన నిరాకరించారు. తరువాత మరో మేనేజర్ ఆ లేఖను అప్రూవ్ చేసినట్లు సమాచారం. టిల్లింగ్‌హాస్ట్ తన నిర్ణయం వెనుక ఎలాంటి వ్యక్తిగత ఉద్దేశం లేదని చెబుతున్నారు.



# ‘స్పిరిట్’ వివాదం మళ్లీ రగిలిందా?..

ణవవజూఅఝ । పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘స్పిరిట్’ మరోసారి చర్చల్లో నిలిచింది. ఈ సినిమాలో తొలుత కథానాయికగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొనే పేరు వినిపించిన సంగతి తెలిసిందే. అయితే అనంతరం ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో పలు ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు పారితోషకం, లాభాల్లో వాటా వంటి అంశాలపై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఈ వివాదం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ‘స్పిరిట్’ చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో దీపిక ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై కొన్ని వ్యాఖ్యలు చేసారు. లాభాల్లో వాటా కోరడం, కొన్ని షరతులు పెట్టడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. దీంతో దీపికను విమర్శిస్తూ కొందరు నెటిజన్లు పోస్టులు చేయగా, మరోవైపు ఆమెకు మద్దతుగా కూడా పలువురు స్పందించారు. అయితే ఈ వివాదం ఇక్కడితో ముగిసిపోలేదనే అభిప్రాయం తాజాగా దీపిక చేసిన వ్యాఖ్యలతో కలుగుతోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న దీపిక పదుకొనే సినీ పరిశ్రమలో పురుషులు, మహిళల మధ్య పారితోషకాల్లో ఉన్న వ్యత్యాసంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ సినిమా విషయంలో తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకున్నారు. ఆ సినిమాలో నటిస్తున్న ఓ స్టార్ హీరోకు నిర్ణయించిన పారితోషకం గురించి తనకు తెలుసని, అయితే కెరీర్ పరంగా తాను కూడా అత్యంత విజయవంతమైన నటినేనని భావిస్తానని దీపిక పేర్కొన్నారు. ఆ హీరో కంటే ఎక్కువ సినిమాలు చేశానని, తన కెరీర్, మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుని తాను కోరుకున్న పారితోషకాన్ని కోట్ చేశానని తెలిపారు. అయితే హీరోకు భారీ పారితోషకం చెల్లిస్తున్నామని, తనకు అడిగినంత మొత్తం ఇవ్వడానికి బడ్జెట్ లేదని ఆ సినిమా టీమ్ చెప్పిందని దీపిక వెల్లడించారు. దీంతో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని తాను నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ వ్యాఖ్యలు ఏ సినిమా గురించి అని ప్రశ్నించగా, ఆ ప్రాజెక్ట్ పేరును బహిరంగంగా చెప్పడానికి దీపిక నిరాకరించారు. తాను సినిమా పేర్లు బయటపెట్టి మాట్లాడే వ్యక్తిని కాదని ఆమె స్పష్టం చేశారు. అవకాశం చేజారిపోతుందనే భయంతో చాలామంది హీరోయిన్లు పారితోషకం విషయంలో రాజీ పడుతుంటారని, అందుకే మహిళలు కూడా తమ పారితోషకం విషయంలో మరింత స్పష్టతతో, ధైర్యంగా ఉండాల్సిన అవసరం ఉందని దీపిక అభిప్రాయపడ్డారు.

# కియారాకు సౌత్ కలిసిరావట్లేదా?



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీకి సౌత్ సినిమా పెద్దగా కలిసి రావడం లేదనే టాక్ వినిపిస్తోంది. అప్పట్లో కొరటాల శివ దర్శకత్వంలో సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సరసన నటించిన ‘భరత్ అనే నేను’ చిత్రం మాత్రమే దక్షిణాదిలో ఆమెకు మంచి విజయాన్ని అందించింది. ఆ తరువాత దక్షిణాదిన ఆమె సినిమా చేసిన ప్రతిసారి ఏదో తేడా కొడుతోంది. అప్పట్లో మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్‌తో చేసిన ‘వినయ విధేయ రామ’, తరువాత అదే హీరోతో చేసిన ‘గేమ్ ఛేంజర్’ చిత్రాలు నిరాశపరిచాయి. తాజాగా పాన్ ఇండియా రాకింగ్ స్టార్ యశ్ సరసన నటించిన ‘టాక్సిక్’ కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదనే టాక్ వస్తోంది. దీంతో ‘భరత్ అనే నేను’ మినహా సౌత్‌లో కియారా సినిమాలు అన్నీ వరుసగా నిరాశపరుస్తున్నాయి. ఇక త్వరలోనే కోలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది ఈ భామ. ఓ తమిళ సినిమాకు ఓకే చెప్పానని.. త్వరలో వివరాలు వెల్లడిస్తానని ఇటీవల టాక్సిక్ సినిమా ప్రచారంలో తెలిపింది. ఇక మరోవైపు ముంబైలో సముద్రానికి ఎదురుగా ఓ కొత్త ఫ్లాట్‌ను కియారా కొనుగోలు చేసింది. దాని ఇంటీరియర్ పనుల కోసం కొంతకాలం సినిమాలకు విరామం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# రాఖీ యాడ్ వివాదం..

## ట్రోలర్స్‌కి మరోసారి కౌంటరిచ్చిన కృతి సనన్




రాఖీ పర్వదినం సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఓ ఆభరణాల ప్రకటన సోషల్ మీడియాలో ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ యాడ్‌లో కృతి ధరించిన దుస్తులు, అలాగే పెంపుడు కుక్కకు రాఖీ కట్టడంపై కొందరు నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ ట్రోలింగ్‌పై కృతి సనన్ తాజాగా సోషల్ మీడియా వేదికగా మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చారు. తన సోదరి నపుర్ సనన్‌తో కలిసి రాఖీ పండుగను జరుపుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న కృతి ఒక పోస్ట్ పెట్టింది. ఈ ఫొటోలో ఇద్దరి చేతులు మాత్రమే కనిపిస్తుండగా, ఇద్దరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఉన్నారు. (రాఖీ ఫ్యాషన్ కమిటీ ఇంకా సమావేశంలోనే ఉన్నట్లుంది.. కానీ మేం మాత్రం అసలైన విషయాలపైనే దృష్టి పెట్టాం అంటూ) ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టు ద్వారా తన దుస్తులను విమర్శించిన వారికి ఆమె పరోక్షంగా చురకలంటించారు. అంతకుముందు కూడా మహిళల దుస్తుల ఆధారంగా వారి సంస్కృతిని, సంప్రదాయాలను జడ్జ్ చేయడంపై కృతి తీవ్రంగా స్పందించారు. పండుగలలో ముఖ్యం భావోద్వేగాలే తప్ప దుస్తులు కాదని ఆమె స్పష్టం చేశారు.



# క్షయ్-సైఫ్ యాక్షన్ మూవీ.. ఫుల్ వయొలెంట్‌గా ట్రైలర్

అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ లీడ్ రోల్లో వస్తోన్న లేటేస్ట్ మూవీ హైవాన్. ఈ మూవీని ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ నారాయణ, శైలజ దేశాయ్ ఫెన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా వచ్చే నెల 11న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలోనే హైవాన్ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే మర్డర్స్ నేపథ్యంలోనే ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇందులో సన్నివేశాలు చూస్తుంటే ఫుల్ వయొలెంట్‌గా ఉండనుందని అర్థమవుతోంది. అక్షయ్- సైఫ్ మధ్య ఫైట్ సీన్స్ ఈ చిత్రంపై మరింత ఆసక్తి పెంచుతున్నాయి. కాగా.. ఈ చిత్రంలో బోమన్ ఇరానీ, సయామీ ఖేర్, శ్రియా పిల్గాంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# అల్లు అర్జున్‌తో లోకేష్ ప్రయోగం ఎందుకు?



లోకేష్ కనగరాజ్ పేరు వినగానే ౹ాజఖ గుర్తుకు వస్తుంది. ఈ దర్శకుడు తీసిన ఖైదీ 2, విక్రమ్ 2, రోలెక్స్ వంటి సినిమాల కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇలాంటి సమయంలో ఆయన ఆ సినిమాలను పక్కన పెట్టి మరీ ముందుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సినిమా చేయడం ఆసక్తికరంగా మారింది. దానికి కారణం.. దాదాపు ఆరేళ్ల క్రితమే మైత్రీ మూవీ మేకర్స్ లోకేష్‌కు అడ్వాన్స్ ఇచ్చిందట. మరోవైపు అల్లు అర్జున్‌తో సినిమా చేయాలనే ఆలోచన కూడా కొంతకాలంగా ఉందని లోకేష్ ఓ సందర్భంలో వెల్లడించాడు. ఈ రెండు కమిట్‌మెంట్లు ఇప్పుడు కలవడంతో AA23 పట్టాలెక్కింది. ఇక ఖైదీ 2 ఆలస్యానికి ఆ సినిమా హీరో కార్తి షెడ్యూల్స్ కూడా కారణమయ్యాయి. రజినీకాంత్--కమల్ హాసన్ కాంబినేషన్ కోసం లోకేష్ కొంతకాలం పనిచేశారు. కానీ ఎందుకో ఆ ప్రాజెక్ట్ కుదరలేదు. అదే సమయానికి కార్తి కూడా మరో సినిమాకు డేట్స్ ఇచ్చేశాడు. దీంతో లోకేష్‌కు వచ్చిన గ్యాప్‌లో అల్లు అర్జున్ ప్రాజెక్ట్ ముందుకు వచ్చింది. మైత్రీ నిర్మిస్తున్న ాూా23 సినిమాని పాన్ ఇండియా రేంజ్‌లో రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే వచ్చిన అనౌన్స్‌మెంట్ వీడియోలో అడవి, గుర్రం, జంతువుల నేపథ్యంలో ఆసక్తికరమైన ప్రపంచాన్ని హింట్ చేశారు. అయితే ఆ సినిమా కథపై మాత్రం ఎలాంటి ఇంకా క్లారిటీ లేదు. LCUతో కనెక్షన్లు లేకుండా లోకేష్ చేస్తున్న ఈ కొత్త ప్రయోగం ఎలా ఉండబోతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరం. అల్లు అర్జున్ సినిమా తర్వాత తన తదుపరి సినిమా ఖైదీ 2నే అని లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశాడు. అంటే ఇది ౹ాజఖకి బ్రేక్ మాత్రమే.. ముగింపు కాదు!



# నయనతార ఫస్ట్ రెమ్యూనరేషన్ రూ.2,000..? మరి ‘టాక్సిక్’కి ఎంతో తెలుసా?

సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా నయనతార తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా తన కెరీర్ తొలినాళ్లకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన మొదటి జీతం గురించి వెల్లడించింది. తాజాగా నయనతారను ఆమె తొలి ఉద్యోగం గురించి అడిగారు. దీనికి స్పందించిన నయనతార.. తన మొదటి పని ఓ మ్యాగజైన్ కవర్ షూట్ అని గుర్తుచేసుకుంది. ఓ ఫ్యాషన్ కార్యక్రమం కోసం తనను పిలిచారని తెలిపింది. ఆ సమయంలో తనకు వచ్చిన పారితోషికం కేవలం రూ. 2,000 నుంచి రూ. 3,000 వరకు మాత్రమే అని నయనతార చెప్పింది. ఆ చిన్న మొత్తంతో ప్రారంభమైన తన కెరీర్.. ఆ తర్వాత దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగే స్థాయికి చేరుకోవడం విశేషం. నయనతార చాలా కాలంగా సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్‌గా కొనసాగుతున్న విషయం తెలిసిందే. మోడలింగ్ ద్వారా సినీరంగం దృష్టిని ఆకర్షించిన ఆమె 2003లో ‘మనస్సినక్కరే’ సినిమాతో నటిగా సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. మ్యాగజైన్‌లో నయనతార ఫొటోలు చూసిన దర్శకుడు సత్యన్ ఆమెకు తొలి సినిమా అవకాశం ఇచ్చాడు. ఆ తర్వాత ‘అయ్యా’, ‘చంద్రముఖి’ చిత్రాలతో తమిళంలో గుర్తింపు తెచ్చుకుంది. రజనీకాంత్‌తో చేసిన చంద్రముఖి సినిమా నయనతార కెరీర్‌ను మలుపుతిప్పింది. ఆ తర్వాత తెలుగులో కూడా ఆమె పాపులర్ అయింది. అదే టైమ్‌లో ఫిమేల్ ఓరియంటెడ్ సినిమాల వైపు ఫోకస్ పెట్టింది. అవి సక్సెస్ కావడంతో తిరుగులేని లేడీ సూపర్‌స్టార్‌గా క్రేజ్ సంపాదించుకుంది. వరుస విజయాలతో లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన నయనతార 2023లో షారుఖ్ హీరోగా నటించిన ‘జవాన్’తో బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. నయనతార ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ. 10 కోట్ల వరకు రెమ్యూనరేషన్ అందుకుంటున్నట్లు సమాచారం. అంటే.. కేవలం రూ. 3 వేలతో మొదలైన ఆమె సినీ ప్రయాణం ప్రస్తుతం కోట్ల రూపాయల పారితోషికం అందుకునే స్థాయికి చేరింది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/